


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States




విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 130 | ది. 22-7-2025 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 130 | Date : 22-7-2025 | Tuesday | Pages : 8 | Rs.1/-

## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకం అమలు

- మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు పథకంలో 'జీరో ఫేర్ టిక్కెట్'
- మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వివరాలతో టిక్కెట్ల జారీ
- రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు
- సొంతంగా విద్యుత్ ఉత్పత్తి-చార్జింగ్ స్టేషన్లతోనే స్వయం సమృద్ధి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



**అమరావతి,జూలై 21 (వార్తాప్రభ) :** ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు చేయనున్న ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంలో మహిళలకు 'జీరో ఫేరో టిక్కెట్' ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడ నుంచి ఎక్కడకు ప్రయాణం చేస్తున్నారు... ఉచిత ప్రయాణంతో ఎంతమేర వారికి డబ్బులు ఆదా అయ్యాయి... 100 శాతం ప్రభుత్వం ఇస్తున్న రాయితీ... వంటి వివరాలు ఆ టిక్కెట్‌లో పొందుపరచాలని చెప్పారు. జీరో ఫేర్ టిక్కెట్ ఇవ్వడం ద్వారా ఎంత లబ్దిపొందారనే విషయం రాష్ట్రంలోని మహిళా ప్రయాణికులు అందరికీ సులభంగా తెలుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇందుకు సంబంధించి సాఫ్ట్‌వేర్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకంపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఏ ఏ రాష్ట్రాలకు ఆర్థికంగా ఎంత భారం పడింది... మన రాష్ట్రంలో ఎంత వ్యయం కానుందనే అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఎట్టిపరిస్థితుల్లో పథకాన్ని ఆగస్ట్ 15 నుంచి సమర్ధవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

**ఆర్టీసీని లాభాల బాట పట్టించండి :** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం త్వరలో అమలు చేస్తున్నందున ఆర్టీసీకి భారం కాకుండా... ఇతర ఆదాయ మార్గాలు పెంపొందించుకోవడం, నిర్వహణా వ్యయం తగ్గించుకోవడం ద్వారా సంస్థను లాభాల బాట పట్టించాలని ముఖ్యమంత్రి సూచించారు. లాభాల ఆర్జనకు ఎలాంటి మార్గాలున్నాయి.. ఎటువంటి విధానాలు తీసుకురావాలి... అనే దానిపై ఒక కార్యాచరణ రూపొందించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇకపై ఏసీ ఎలక్ట్రానిక్ బస్సులు మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రస్తుతం ఉన్నవాటిని ఎలక్ట్రికల్ బస్సులుగా మారిస్తే నిర్వహణా వ్యయం తగ్గుతుందని... అలాగే ఇందుకు అవసరమయ్యే విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ డిపోల్లోనూ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే అంశంపైనా అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు.

## ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- రాజకీయ పోరాటం చేయొద్దని హితవు
- అది అధికార దుర్వినియోగమేనని ఆగ్రహం
- కర్ణాటక హైకోర్టు తీర్పుపై పిటిషన్ ను తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ,జూలై 21 (వార్తాప్రభ) :** సూర్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (ముడా) భూముల అక్రమ కేటాయింపుల కేసులో దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి కర్ణాటక హైకోర్టు తీర్పును ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్ ను పరిశీలించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ల ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భూముల అక్రమ కేటాయింపుల వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి, రాష్ట్ర మంత్రి సురేశ్ లకు జారీ చేసిన సమన్లను హైకోర్టు కొట్టివేసిందని ఈడీ గుర్తుచేసింది.ఈ తీర్పును సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్ ను పరిశీలిస్తూ... ఈ వ్యవహారంలో ఈడీ రాజకీయ పోరాటం చేస్తోందని సుప్రీం ధర్మాసనం విమర్శించింది. ఇది ముమ్మాటికీ అధికార దుర్వినియోగం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. పిటిషన్ పరిగణనలోకి తీసుకోవడంలేదని స్పష్టం చేసింది. ఈడీని రాజకీయ పోరాటాలకు ఎందుకు ఉపయోగిస్తున్నారంటూ న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ కేసు విచారణకు స్వీకరించడంపై సీజేఐ బెంచ్ అయిష్టత వ్యక్తం చేసింది.

## జీవో 49పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం!

- ఆదివాసీలకు శుభవార్త చెప్పిన తెలంగాణ ప్రభుత్వం
- 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్' జీవోను నిలుపుదల చేసిన ప్రభుత్వం
- ఆదివాసీల ఆందోళనలు నివృత్తి చేసే వరకు జీవో అమలు నిలిపి ఉంచాలన్న ప్రభుత్వం



**హైదరాబాద్,జూలై 21 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలకు శుభవార్తను అందిం చింది. 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్' ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీవోను నిలిపివేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, వారి ఆందోళనలను నివృత్తి చేసే వరకు జీవో అమలును నిలిపి ఉంచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జీవో 49 ద్వారా కొమురంభీమ్ ఆసిఫాబాద్‌లో 3 లక్షల ఎకరాల అటవీ భూమిని కన్జర్వేషన్ ఫారెస్ట్ కారిడార్‌గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కన్జర్వేషన్ కారిడార్ వల్ల తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆదివాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది!

## ఢిల్లీకి మాజీ సీఎం జగన్

### -మారుతున్న లెక్కలు..!!



**విజయవాడ, జూలై 21 (వార్తాప్రభ) :** ఏపీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. లిక్కర్ కేసు రాజకీయంగా ఉత్కంఠ పెంచుతోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు వైసీపీ నేతలను అరెస్ట్ చేసారు.తాజాగా సిట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ లో మాజీ ముఖ్యమంత్రి అంతిమ లబ్దిదారుగా తేల్చారు. ఇతర కేసుల్లో నూ వైసీపీ నేతలు చిక్కుకున్నారు. ఈ సమయంలో మాజీ సీఎం జగన్ పార్టీ ముఖ్య నేతలతో కీలక మంత్రాంగం చేసారు. ఢిల్లీకి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

**జగన్ కసరత్తు..** వైసీపీ నేతలు వరుస కేసుల్లో చిక్కుకుంటున్నారు. లిక్కర్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ తరువాత ఒక్క సారిగా వాతావరణం హీటెక్కింది. ఇదే సమయంలో ఛార్జ్ షీట్ లో అంతిమ లబ్ధిదారుగా జగన్ గురించి ప్రస్తావనతో ఉత్కంఠ పెరుగుతోంది. లిక్కర్ స్కాం అసలు జరగలేదని.. సీఎంఓ లో ఎలాంటి చర్చ.. నిర్ణయాలు లేవని గతంలోనే జగన్ స్పష్టం చేసారు. తన పరామర్శల పర్యటనల వేళ చోటు చేసుకున్న పరిణామాలు.. వరుస కేసుల పైన జగన్ సీరియస్ గా ఉన్నారు. లిక్కర్ చార్జ్ షీట్.. పార్టీ నేతల పైన కేసుల అంశం పైన జగన్ సీనియర్ న్యాయ వాదులతో చర్చ లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పార్టీ ముఖ్య నేతలతోనూ సమీక్షించారు.

**ఢిల్లీలో ఫిర్యాదులు..** మిథున్ అరెస్ట్ ను జగన్ తప్పు బట్టారు. రాజకీయ నిర్ణయంగా పేర్కొన్నారు. ఏపీలో వరుసగా ఇలా వరుసగా కేసుల నమోదు పైన ఢిల్లీ స్థాయిలో ఫిర్యాదులు చేయాలని ఆలోచన చేస్తున్నారు. తానే స్వయంగా వెళ్లి ఢిల్లీలో ఈ కేసుల గురించి వివరించే యోచనలో ఉన్నారు. అదే విధంగా ఢిల్లీ కేంద్రంగా తన అయిదేళ్ల కాలంతో పాటుగా 2014-19 మధ్య కాలంలో జరిగిన మద్యం లావా దేవీల గురించి వివరించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న ఈ సమయంలో వెళ్లాలనే అభిప్రాయం పార్టీ నేతల నుంచి వచ్చినట్లు సమాచారం. పార్లమెంట్ లోనూ ఏపీలో కేసుల వ్యవహారం పైన ప్రస్తావించాలని వైసీపీ నేతలు భావిస్తున్నారు. అటు టీడీపీ నేతలు సైతం లిక్కర్ స్కాం పైన పార్లమెంట్ లో లేవనెత్తుతామని చెబుతున్నారు.

## రేషన్ కార్డు అంటే ఆహార భద్రత

- 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం దేశంలోనే ఒక రికార్డు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,జూలై 21 (వార్తాప్రభ) :** రేషన్ కార్డు అంటేనే ఆహార భద్రత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం మధిర నియోజకవర్గం బోనకల్లు మండల కేంద్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు. అత్యంత పేదలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన మధ్యతరగతి వర్గాలకు కూడా ఇందిరమ్మ ప్రభుత్వంలో రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడమే కాదు, సన్న బియ్యం కూడా ప్రజా ప్రభుత్వంలో పంపిణీ జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇవ్వడం భారతదేశ చరిత్రలో నే ఒక రికార్డు అని అన్నారు. లబ్ధిదారుల సంఖ్య రీత్యా చూసినా, సన్న బియ్యం వారీగా చూసిన ఈ దేశంలో ఆహార భద్రత విషయంలో తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా నిలిచిందని తెలిపారు. కొత్తగా పెళ్లి అయిన వాళ్ళు గత పది సంవత్సరాలుగా రేషన్ కార్డులు పేరు నమోదు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్పులు, మార్పుల కోసం గత పది సంవత్సరాలు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసిన ఫలితం కనిపించలేదని తెలిపారు. ఒక మధిర నియోజకవర్గంలోనే కొత్తగా 13,767 మంది లబ్ధిదారులకు ఒకేరోజు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సంతోషించదగిన అంశం అన్నారు. రేషన్ కార్డులో జారీ అనేది ఉమ్మడి రాష్ట్రంలో నిరంతర ప్రక్రియ కాగా ప్రతి సంవత్సరాలు పరిపాలించిన వారు ఈ విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు.

## అంబటి, అనిల్ కుమార్ లు నోటిని కంట్రోల్ లో పెట్టుకోండి

- తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ఆగ్రహం



**అమరావతి,జూలై 21 (వార్తాప్రభ) :** మిధున్ రెడ్డి అరెస్ట్ తర్వాత వైసీపీ ఓ విచిత్రమైన వాదనను తెరపైకి తెస్తోందని, అసలు ఆధారాలు లేవనే అడ్డగోలుగా వాదిస్తున్నారని ఆధారాలు లేకుండా అరెస్టులు చేసే ఉద్దేశ్యమే ఉంటే.. ఇప్పటికే రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఉన్న వైసీపీ నేతలను ఎప్పుడో జైళ్లకు పంపేవాళ్లమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. అమరావతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మా హయాంలో మద్యం షాపులు తగ్గాయని, మీ హయాంలో పెరిగాయని.. మా ప్రభుత్వంలో మద్యం వినియోగం తగ్గిందని.. మీ హయాంలో వినియోగం ఎక్కువగా ఉందంటూ ఏదేదో కామెంట్లు చేస్తున్నారని. వీటన్నింటికంటే ముందు వైసీపీ నేతలు ఓ ప్రశ్నకు సమాధానం చెప్పగలరా..? అన్నారు. మద్య నిషేధం చేస్తామన్న వైసీపీ.. అధికారంలోకి వచ్చాక ఎందుకు మద్య నిషేధం విధించలేదని ఆయన ప్రశ్నించారు..? దశలవారీగా మద్య నిషేధం చేస్తామని చెప్పిన నాటి వైసీపీ ప్రభుత్వం.. ఆ సంగతి ఎందుకు మరిచిపోయారని ఆయన విమర్శించారు. మరిచిపోవడానికి.. గుర్తు లేదని అనడానికో.. ఇదేమీ చిన్న చితకా హామీ కాదని. మద్యనిషేధం చేశాకే.. మళ్లీ ఓట్లడుగుతా అని ఒట్టేసి జగన్ చెప్పారని ఇంత పెద్ద హామీని ఎలా పక్కన పెట్టేశారని ఆయన విమర్శించారు మద్య నిషేధం చేస్తామని చెప్పి.. ప్రైవేటు షాపులను నిషేధించి.. ప్రభుత్వ దుకాణాలు ఎందుకు తెరిచారన్నారు.విచిత్రమేమిటంటే.. ఇప్పటి వరకు సిట్ గుర్తించిన దాని ప్రకారం చూస్తే.. ఇప్పటి వరకు 10 కంపెనీల ద్వారా అక్రమ లావాదేవీలు జరిగాయని గుర్తించారని ఆయన తెలిపారు.

## మూడేళ్లలో అమరావతి నిర్మాణం ఖచ్చితంగా పూర్తి చేస్తాం

- వచ్చే మార్చి నాటికి ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తిచేసేలా ముందుకెళ్తున్నాం
- గత ప్రభుత్వం రైతులతో పాటు కాంట్రాక్టర్లను కూడా ఇబ్బంది పెట్టింది
- రెండో దశ ల్యాండ్ పూలింగ్ పై కేబినెట్ సబ్ కమిటీలో చర్చిస్తాం
- అమరావతి నిర్మాణ పనుల పరిశీలన తర్వాత మీడియాతో మంత్రి నారాయణ......



**అమరావతి,జూలై 21 (వార్తాప్రభ) :** గత ప్రభుత్వం అమరావతి రైతులతో పాటు కాంట్రాక్టర్లను కూడా అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు మంత్రి నారాయణ...అమరావతి నిర్మాణం మూడేళ్లలో ఖచ్చితంగా పూర్తిచేసి తీరుతామని మంత్రి మరోసారి స్పష్టం చేసారు..ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు.రాజధానిలో జరుగుతున్న నిర్మాణ పనులను సీఆర్డీఏ ఇంజినీర్లతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు...మంత్రులు,హైకోర్టు న్యాయమూర్తులు,ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల బంగ్లా లతో పాటు ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు..ఆయా నిర్మాణాలకు సంబంధించి నిర్మాణ సంస్థల ప్రతినిధులను వివరాలు అడిగి వివరాలు తెలుసుకున్నారు..మొత్తం కార్మికులు ఎంతమంది పనిచేస్తున్నారు...?నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న సామాగ్రి,మెషినరీ గురించి అడిగి తెలుసుకున్నారు.ఆ తర్వాత నేలపాడులోని ఆలిండియా సర్వీస్ అధికారుల క్వార్టర్ల వద్ద మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. అమరావతిలో భవనాలు,ట్రంక్ రోడ్లు,సీవరేజి పనులు వేగంగా జరుగుతున్నాయి..ఎల్పీఎస్ లే అవుట్ లలో పనులకు కూడా టెండర్లు పూర్తయ్యాయి...2014-19 మధ్యలోనే అధికారుల కోసం 4000 ఇళ్ల నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తి చేసి నిర్మాణాలు ప్రారంభించామన్నారు మంత్రి...అయితే గత ప్రభుత్వం అన్ని పనులను నిలిపివేసిందన్నారు...తిరిగి పాత టెండర్లు రద్దు చేసి,న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకుని కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఆలస్యమైందన్నారు..ప్రస్తుతం రాజధానిలో అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు...కొన్నిచోట్ల మాత్రం వర్షాల కారణంగా కొంచెం ఇబ్బందులున్నాయన్నారు. వీటిలో ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ క్వార్టర్లు 12 టవర్లలో 288 ఫ్లాట్లు,ఆలిండియా సర్వీస్ అధికారులకు 6 టవర్లలో మొత్తం 144 ఫ్లాట్లు నిర్మిస్తున్నామన్నారు..అలాగే ప్రిన్సిపల్ సెక్రటరీల కోసం 25 బంగళాలు,సెక్రటరీల కోసం 90 బంగళాలు,మంత్రుల కోసం 35 బంగళాలు,జడ్జిల కొరకు 36 బంగళాలు,నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కొరకు మొత్తం 21 టవర్లలో 1968 ఫ్లాట్లు నిర్మిస్తున్నాం.ఇక గెజిటెడ్ ఆఫీసర్స్ లో టైప్ -1 అధికారుల కొరకు 4 టవర్లలో 384 ఫ్లాట్లు,టైప్ - 2 అధికారుల కొరకు 4 టవర్లలో 336 ఫ్లాట్లు,గ్రూప్ - డి ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు..ఇక అమరావతిలోని హ్యాపీనెస్ట్ లో మొత్తం 6 టవర్లలో 1200 ఫ్లాట్లు నిర్మాణం జరుగుతుందన్నారు... ఈ మొత్తం భవనాల్లో ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ,ఏఐఎస్ అధికారుల క్వార్టర్లు ఈ ఏడాది డిసెంబర్ లోగా పూర్తిచేస్తామని,ఇతర నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు.మరోవైపు ఐకానిక్ భవనాల నిర్మాణాలపై కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు,డిజైన్ రూపొందించిన నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ప్రతినిధుల మధ్య తుది చర్చలు జరుగుతున్నాయన్నారు...త్వరలోనే ఐకానిక్ భవనాల నిర్మాణం కూడా ప్రారంభిస్తామన్నారు మంత్రి.

**డిసెంబర్ నాటికి మెజారిటీ ప్రయివేట్ సంస్థల నిర్మాణాలు ప్రారంభం..** అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 72 సంస్థలకు భూకేటాయింపులు చేసినట్లు మంత్రి నారాయణ తెలిపారు...ఆయా సంస్థల ప్రతినిధులతో స్వయంగా సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటుచేసి అగ్రిమెంట్ లు చేసుకున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు...ఆయా సంస్థల్లో మెజారిటీ సంస్థలు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి మెజారిటీ సంస్థలు నిర్మాణ పనులు ప్రారంభిస్తాయన్నారు...ఆయా సంస్థలు నిర్ధేశిత కాలానుగుణంగా నిర్మాణాలు పూర్తిచేస్తాయన్నారు..

**రెండో దశ భూసమీకరణపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చిస్తాం..** అమరావతిలో రెండో దశ ల్యాండ్ పూలింగ్ పై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు...కేబినెట్ సబ్ కమిటీలో చర్చించారా అని గత మంత్రివర్గ సమావేశంలో సీఎం ప్రస్తావించారని...అందుకే కేబినెట్ సబ్ కమిటీలో చర్చిస్తామన్నారు...కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకు వచ్చే కేబినెట్ లో భూసమీకరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

## ఏపీలో భారీ వర్షాలు...

- అప్రమత్తంగా ఉండాలన్న ఏపీఎస్డీఎంఏ
- ఏపీల మరో నాలుగు రోజుల పాటు వర్షాలు
- ఈ నెల 24న బంగాళాఖాతంలో అల్పపీడనం



**అమరావతి, జూలై 21 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్‌లో మరో నాలుగు రోజుల పాటు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఆయన సూచించారు. రేపు (జులై 22) ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వర్షాలు, పిడుగుల నేపథ్యంలో ప్రజలు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్డీఎంఏ సూచించింది. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాల దగ్గర నిలబడరాదు. విద్యుత్ స్తంభాలకు, వైర్లకు దూరంగా ఉండాలి. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ఇళ్లల్లో ఉన్నవారు కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. పిడుగులు పడే సమయంలో విద్యుత్ ఉపకరణాలను ఉపయోగించరాదు. ప్రజలు ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ విజ్ఞప్తి చేశారు. కాగా, పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా, ఏపీ ఉత్తర కోస్తా వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని ఐఎండీ అమరావతి విభాగం వెల్లడించింది. అంతేగాకుండా, ఈ నెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

# ప్రకృతి వైద్యంలో విశిష్ట సేవలకు ఒంటిమామిడి మహేశ్వరరావుకు గౌరవ పురస్కారం



**కాకినాడ,జూలై 21 (వార్తాప్రభ) :** ప్రకృతి వంశపారంపర్య వైద్య శ్రేణిలో కీలక స్థానం దక్కించుకున్న ఒంటిమామిడి కె.వి.కె. మహేశ్వరరావుకు సంప్రదాయ ప్రకృతి వైద్యులు పురస్కారం లభించింది. దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఈ అవార్డును శాసనమండలి సభ్యులు జి. శ్రీనివాసుల నాయుడు,ప్రముఖులు పేరబత్తుల రాజశేఖర్, సంస్థ చైర్మన్ వాకడ వెంకట రమణ ఘనంగా ప్రధానం చేశారు.మహేశ్వరరావు పదేళ్లుగా గ్రామీణ ప్రాంతాలలో వేలాది మందికి ప్రకృతి వైద్యం ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని ప్రజల్లో ప్రవేశపెట్టారు. సంప్రదాయ పద్ధతులను ఆధునిక సమాజానికి చేరువ చేస్తూ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వైద్యం మన సంపద. దీనిని భవిష్యత తరాలకు అందిస్తూనే కొత్త ఆవిష్కరణలతో ముందుకు తీసుకెళ్తాను అని అన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రకృతి వైద్యంలో విశిష్ట సేవలందించిన మహేశ్వరరావుకు ఈ అవార్డు అందించడం గర్వకారణమని చెప్పారు.ఈ సందర్భంగా కె.వి.కె మహేశ్వరరావు ను పలువురు అభినందించారు.

# దళిత జాతి ముద్దుబిడ్డ



**తిరువూరు,జూలై 21 (వార్తాప్రభ) :** రాజీవ్ భవన్ లో అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే గారి 83 వ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి ఘనంగా నిర్వహించారు అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే గారు ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకుడిగా, కర్ణాటక రాష్ట్ర మంత్రిగా పార్లమెంటు సభ్యునిగారాజ్యసభ సభ్యునిగారాజ్యసభలో ప్రతిపక్ష నాయకునిగా, స్టాండింగ్ కౌన్సిల్ కు పార్లమెంట్లో చైర్మన్గా, కర్ణాటక రాష్ట్ర పీసీసీ అధ్యక్షునిగా, కేంద్రంలో రైల్వే శాఖ మంత్రిగా, కార్మిక, ఉపాధి శాఖ మంత్రిగా పనిచేసి శాఖల కే వన్నె తెచ్చిన ఒక దళిత ముద్దుబిడ్డ అని, ఆయన గారు కర్ణాటక విశ్వవిద్యాలయం నుంచి న్యాయవాద పట్టా పొందిన న్యాయవాది, రాజనీతిజ్ఞుడు, సెక్యులర్ విషాన్ని సెక్యులరిజాన్ని నమ్మిన వ్యక్తిగా ఈరోజు కాంగ్రెస్ పార్టీకి ఆయన చేస్తున్న సేవలను గూర్చి కొనియాడుతూ ముఖ్యమంత్రి పదవి చేతి దగ్గరికి వచ్చినప్పటికి ని కొన్ని అనివార్య పరిస్థితులు వల్ల ఆ పదవిని పార్టీ నిర్ణయానికి కట్టుబడి త్యజించిన ఒక మహా గొప్ప నాయకుడని, కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ లకు అండగా నిలబడి దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావటానికి నిరంతరం శ్రమిస్తున్న మహా నాయకుడని, ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండి నీతివంతమైన రాజకీయాలు చేయాలని కొనియాడినారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ నాయకులు జీడిమల్ల బాలు, పగుట్ల చంద్రయ్య, ఇజ్జాడ జగన్నాథం, గంధం శ్రీనివాసరావు, కేవిల్ రావు, యద్దనపూడి రాములు, చావల రంగయ్య, గరికపాటి నరసింహారావు,ముత్తవరపు బెంజిమెన్, కామసాని అనంతరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్ద నుండి 5 ప్రధాన అంశాలు సేకరణ..

- పి4 సర్వేలో పాల్గొన్న మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం,జూలై 21 (వార్తాప్రభ) :** మచిలీపట్టణం మండలం కానూరు గ్రామం పరిధిలో సోమవారం పి4 గ్రామసభ నందు కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ గ్రామ సభ లో ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన P4 సర్వే నందు గల అభ్యంతరాలలో వచ్చిన 100 పేర్లను తెలియపరిచారు .ఈ సర్వే నందు అయిదు అంశాలు అనగా కుటుంబంలో సంపాదించేవారు ఉన్నారా లేరా, మంచినీరు సరఫరా అందుబాటులో ఉందా లేదా , బ్యాంకు ఖాతా ఉందా లేదా, వంట గ్యాస్, విద్యుత్ సరఫరా ఉందా లేదా, మొదలగు ఐదు ప్రధాన అంశాలను ప్రజల వద్ద నుండి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జి దివి మహేష్ , సెక్రెటరీ వెంకటేశ్వర రావు, బొమ్మిడి ఏడుకొండలు,పీత రాము, గోపు వెంకట రమణ, బోలిశెట్టి నాని, మోకా రాజు, బోట్ల రాజేష్, గమిడి ఈమ్మానుయేల్, జొన్నల లోకేష్, సచివాలయ సిబ్బంది ,ఆశా వర్కర్స్, వెలుగు బుక్ కీపర్లు, అంగన్వాడీ టీచర్స్ , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శాకాంబరీ దేవిగా పురుహూతికా అమ్మవారు



**పిఠాపురం,జూలై 21 (వార్తాప్రభ) :** ఆషాడమాసం పురస్కరించుకొని, పాదగయ క్షేత్రంలోని శ్రీ పురుహూతికా అమ్మవారు శాకాంబరీ దేవి అలంకారంలో సోమవారం భక్తులకు దర్శనం ఇచ్చారు.ఇందులో భాగంగానే ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవస్థానం సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా తగు ఏర్పాట్లు చేపట్టారు.

# అన్ని గ్రామాల్లో రోడ్లు,మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- రూ.2.80 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి సుభాష్



**కాజులూరు,జూలై 21 (వార్తాప్రభ) :** దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల్లో రోడ్లు,మౌలిక సదుపాయాలు కల్పించి మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో రూ.2.80 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణానికి సోమవారం మంత్రి సుభాష్ శంకుస్థాపన చేశారు. కాకినాడ కోటిపల్లి రోడ్డు నుంచి శలపాక వెళ్లే రోడ్డుకు ఈ నిధులు వెచ్చించి భూమి పూజ చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ రహదారులతో పాటు, గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పేర్కొన్నారు. కూటమి ఏడాది పాలనలో సుమారు రూ. 1200 కోట్లు వెచ్చించి గుంతలు లేని రోడ్లు నిర్మించామన్నారు. అలాగే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ నిధుల ద్వారా రామచంద్రపురం నియోజవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ దీనావస్థకు చేరుకున్నాయని, అభివృద్ధి, సంక్షేమం ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అభివృద్ధికి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రామచంద్రపురం నియోజవర్గ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఏడాది కాలంలోనే రూ.125 కోట్లు నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి పనులు చేశామని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ ఏ ఎస్ ఎన్ బాబు, మండల ప్రజా పరిషత్ అధికారి జె రాంబాబు, ఏయ్ వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శాలివాహనులు సంఘటితంగా ఉండాలి..

-రాష్ట్ర సంఘ అధ్యక్షులు ఐలాపురం వెంకయ్య కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్లు





**కాకినాడ,జూలై 21 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని శాలివాహనులందరూ సంఘటితంగా ఉండాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్లు అన్నారు.. విజయవాడలోని హెూటల్ ఐలాపురంలో ఆదివారం రాష్ట్ర శాలివాహన సంఘ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ శాలివాహనుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రంగ రాష్ట్ర అధ్యక్షుడు వెంకయ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ లను కాకినాడ శాలివాన సంఘ అధ్యక్షుడు పసలపూడి ప్రసాద రావు ఆధ్వర్యంలో సంఘ పెద్దలు దాలిపర్తి శ్రీనివాసరావు, దాలిపరతి ప్రకాష్ రావు, కోటిపల్లి సుబ్బారావు, కే బాబురావు లు ఘనంగా సన్మానించారు. రాజనగరం డాక్టర్ వదయారు కోనసీమ శా లివాహ న సంఘ అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల సోమన్న "వల్లంకి పిట్ట" పుస్తకావిష్కరణ..



**కర్నూలు,జూలై 21 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త బాలబంధు డా. గద్వాల సోమన్న రచించిన 74వ పుస్తకం "వల్లంకి పిట్ట" కళాభారతి(ఆర్టీసీ X-రోడ్స్), హైదరాబాద్లో ఘనంగా జరిగింది.వాల్మీకి సాంస్కృతిక, సాహితీ సేవా సంస్థ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో, శతాధిక కవి సమ్మేళనం సందర్భంగా యస్వీ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి పద్మశ్రీ డా. కొలకలూరి ఇనాక్,విశ్రాంత అటవీ శాఖ అధికారి ఏ ఎల్. కృష్ణ రెడ్డి, విశ్రాంత భూగర్భ గనుల శాఖ అధికారి వి. డి. రాజగోపాల్ ల చేతుల మీద పుస్తకావిష్కరణ చేయడం విశేషం. అనంతరం అత్యల్ప కాల వ్యవధిలో 76 పుస్తకాలు ముద్రించి,పలు చోట్ల ఆవిష్కరించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న కవి రవి గద్వాల సోమన్న విశేష కృషికిగాను సత్కరించారు. ఈ కార్యక్ర మంలో సినీ గీత రచయిత సాదనాల వెంకటస్వామి, డా.రాధా కుసు మ, గాయకుడు డా.అరవా రవీంద్ర బాబు, కొప్పుల ప్రసాద్, రామలక్ష్మి, పోలయ్య,కవులు, కళాకారులు, మహర్షి వాల్మీకి సాంస్కృతిక, సాహితీ సంస్థ కార్యవర్గము మరియు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు. 'వల్లంకి పిట్ట 'కృతికర్త గద్వాల సోమన్నను హెడ్మాస్టర్ ఏ. జాన్సన్,తోటి ఉపాధ్యాయులు,శ్రేయోభిలాషులు,విద్యార్థులు అభినందించారు.



# రైతుల అభివృద్ధికి బ్యాంకులు కృషి చేయాలి..



**గుడ్లవల్లేరు,జూలై 21 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో రైతుల అభివృద్ధికి బ్యాంకులు పని చేయాలని గుడివాడ బ్యాంకు ఉద్యోగుల సంఘ సెక్రటరీ సిహెచ్.లభయ ఆంజనేయస్వామి డిమాండ్ చేశారు. బ్యాంకులను జాతీయం చేసి 56ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని గుడివాడ బ్యాంకు ఉద్యోగుల సంఘం తరుపున హస్పటల్లో రోగులకు పండ్లు, రొట్టెలను అందించారు. ఇంకా గ్రామణ ప్రాంతాలలో పూర్తి స్థాయిలో బ్యాంకుల సేవలు అందడం లేదన్నారు. వివిధ బ్యాంకులకు సంబంధించిన శాఖలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించి సేవలు అందించాలని కోరారు. తద్వారా వ్యవసాయ సాగుకు బ్యాంకుల నుంచి అందించే రుణాల కారణంగా రైతులు త్వరితగతిన అభివృద్ధి చెందుతారన్నారు. ఆ సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ అగస్త్య విరాళం



**కాకినాడ,జూలై 21 (వార్తాప్రభ) :** హాకీ, ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ తరుపున రూ.1లక్ష విరాళం అందించారు.దీనికి సంబంధించిన చెక్కును శ్రీ అగస్త్య చైర్మన్ డి.నాగేశ్వరరావు జిల్లా కలెక్టరు షాన్ మోహన్ కు అందజేశారు.

# శ్రీ గంగానమ్మకు సారె సమర్పణ..



**గుడ్లవల్లేరు,జూలై 21 (వార్తాప్రభ) :** మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరం నుంచి ఆ మందిర వ్యవస్థాపకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గంగానమ్మ తల్లికి ఆషాఢం సారెను సమర్పించారు. అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. మేళ తాళాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి యలమంచిలి లక్ష్మీ సారెను భక్తిప్రపత్తులతో సమర్పించారు. అమ్మవారి పూజల్లో మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



# 24వ తేదీన కృష్ణాజిల్లా గ్రంథాలయం సంస్థ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు



**విజయవాడ,జూలై 21 (వార్తాప్రభ) :** క్రీడా విభాగం : నగరంలోని ఠాగూర్ గ్రంథాలయం నందు జులై 24 వ తేదీ 135వ శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య మెమోరియల్ సందర్భంగా కంబైన్డ్ కృష్ణాజిల్లాల లోని అన్ని వయస్సుల వారికి ఉచితంగా చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు సరస్వతీ సామ్రాజ్యం ట్రస్ట్ అధ్యక్షులు ప్రొఫెసర్ అయ్యంకి మురళీకృష్ణ మరియు గ్రంథాలయం గ్రేడ్ వన్ టి ఎం ఎల్ ఆఫీసర్ కె రమాదేవి తెలిపారు. ఈ చదరంగం పోటీలకు జిల్లాలలోని అన్ని స్కూలు విద్యార్థినీ విద్యార్థులు క్రీడాకారులు విజయవంతం చేయాలని వివరాలకు 7780466509, 9030308811 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# బంపర్ ఆఫర్ లక్కీ బొనంజ లబ్ధి పొందేటి వీరే

**విస్సన్నపేట,జూలై 21 (వార్తాప్రభ) :** ఏపీ ప్రభుత్వం నాడు ఎన్నికల సమరంలో ఇచ్చిన హామీతో నిలువ నీడలేని అర్హులైన పేదలకు మూడు సెంట్లు స్థలాన్ని ఇచ్చేందుకు శ్రీకారం చుట్టడం జరుగు తుంది. గత ప్రభుత్వంలో అక్క చెల్లెమ్మలకు సెంటున్నర స్థలాలు ఇచ్చిన కాలనీలలో మిగిలిన కాళీ ప్లాట్లను పక్క పక్కన ఉన్న రెండు ప్లాట్లు ఒకటిగా చేసి మూడు సెంటుల స్థలంగా పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేయడం జరుగుతోంది. పాత కాలనీలో సెంటున్నర స్థలాలు ఉన్న వాటిని అది సాలు అని ఆసక్తి కలిగిన లబ్ధిదారులకు ఇచ్చే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. అదే బాటలో గత ప్రభుత్వంలో సొంత ఇంటి కలల సహకారానికి ఇంటి నిర్మాణాలకు లక్ష 70 వేల రూపాయలు ఇచ్చేందుకు ముందుకు రాక ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో 2,80,000 గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇచ్చేందుకు శాఖ పరంగా ఆన్లైన్ దరఖాస్తులు ప్రక్రియ పూర్తి చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతోంది . నాటి వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణదారులకు మరియు స్థలాల పొందిన వారికి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో స్థలాలు పొందే వారికి మరియు ఇంటి నిర్మాణాలు చేసుకునే వారికి మధ్య వ్యత్యాసం డబల్ బొనాంజా కొటన ప్రభుత్వం అందించినట్లు సర్వత్రా అనుకుంటున్నారు.

# రహదారి పనులు తక్షణమే చేపట్టాలి - సిపిఎం నాయకులు




**తిరువూరు,జూలై 21 (వార్తాప్రభ) :** బస్టాండ్ ఔట్ గేట్ నుంచి సూర్యా రెస్టారెంట్ మీదుగా తోకపల్లి వెళ్లి రహదారిని తక్షణమే అభివృద్ధి చేసి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్త లు ఆందోళన చేశారు. బస్టాండ్ ఔట్ వద్ద రోడ్డు పై నిలబడి ఆందోళన చేశా రు. నిధులు మంజూరు అయినట్లు జనసేన నాయకులు పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్ కల్యాణ్ ఫోటోలకు పాలభిషేకం చేసి ఆరు నెలలు అవుతున్నా ఎందుకు అభి వృద్ధి చేయటం లేదని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వర రెడ్డి, ఎస్వీ.భద్రం, బలగాని వెంకటేశ్వరావు, ఆకుల రవి, వి.నాగరాజు, సిహెచ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్ల పై వస్తున్న వదంతులను నమ్మవద్దు

-కృష్ణాజిల్లా పర్యవేక్షణ ఇంజనీర్



**మచిలీపట్నం,జూలై 21 (వార్తాప్రభ) :** గత కొన్ని వారాల నుండి స్మార్ట్ మీటర్ల ద్వారా అధిక బిల్లులు వస్తున్నాయని ప్రజల్లో వదంతులు వ్యాపించాయి. ఈ నేప థ్యంలో స్మార్ట్ మీటర్ల రీడింగ్ ను కచ్చితత్వాన్ని తనిఖీ చేయడానికి ఏపీ సీపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు జులై 12వ తేదీన ఒక కమిటీ నియమించారు. ఈ కమిటీ గుణదల ,గన్నవరం, వరలక్ష్మి నగర్, కొత్తపేట, ఉయ్యూరు, సుందరమ్మపేట, పులిగడ్డ ,ముత్యాలమ్మ సెంటర్ వంటి వివిధ ప్రాంతాలలో స్మార్ట్ మీటర్లతో పాటు అమర్చిన చెక్ మీటర్లను పరిశీలించారు. ఈ తనిఖీలు కొత్తగా అమర్చిన స్మార్ట్ మీటర్ల తో పాటు ప్రస్తుతం ఉన్న మీటర్ల రీడింగ్ ను పోల్చి విశ్లేషించారు. ఈ తనిఖీ ఫలితాలలో 99.9శాతం స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్ల తో సమానమైన రీడింగ్ చూపించాయి. మిగిలిన మీటర్లలో రెండు శాతం కంటే తక్కువగా స్వల్ప వ్యత్యాసం ఉంది. అది కూడా అనుమతించదగ్గ పరిమితి లోపలే ఉందని స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్ల వల్లే కచ్చితంగా పనిచేస్తాయని తేటతెల్లమయింది. స్మార్ట్ మీటర్లు ప్రస్తుతం ఉన్న మీటర్ల వలే ఉంటుంది వాటికి అదనంగా కమ్యూనికేషన్ సదుపాయం ఉంటుంది. వినియోగదారులు రీడింగ్ కచ్చితంగా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్మార్ట్ మీటర్ల వ్యవస్థను అదంతా నన్ను నమ్మొద్దు అని ఏపీ సీపీడీసీఎల్ కృష్ణాజిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ సత్యానందం విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మీ మీటర్ రీడింగ్ లు వివిధ కారణాలవల్ల ఖచ్చితమైన రేటింగ్ ను తీయడానికి కొన్నిసార్లు సాధ్యపడటం లేదు . ఇప్పుడు ఈ స్మార్ట్ మీటర్ వల్ల ఖచ్చితమైన రీడింగ్ ను ఆన్లైన్లో చూపబడుతుందని తెలిపారు. మీటర్ రీడింగ్ కోసం ఎవరు కూడా మీ ఇంటి ఆవరణలో రానవసరం లేదని ప్రజలకు తెలిపారు. స్మార్ట్ మీటర్లు అమర్చడం వలన వినియోగదారులకు ఎటువంటి ఖర్చు ఉండదు ఖర్చు అంతా విద్యుత్ సంస్థలు విద్యుత్ మంత్రిత్వ శాఖ కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని, ఆర్డీఎస్ఎస్ పథకంలో డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ అమర్చబడతాయి.

# వార్తా ప్రభ

## హైదరాబాద్

# షాపూర్ నగర్ మార్కెట్ ఏర్పాటులో గుమ్మడి ఆంజనేయులు కృషి మరువలేనిది

*ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్*



**కుత్బుల్లాపూర్ జూలై 21 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ సూరారం డివిజన్ టిఎస్ఐఎసి కాలనీలో నిర్వహించిన "గుమ్మడి ఆంజనేయులు దశదిన కర్మ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరై గుమ్మడి ఆంజనేయులు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... షాపూర్ నగర్ మార్కెట్ ఏర్పాటులో గుమ్మడి ఆంజనేయులు కృషిని గుర్తు చేసుకున్నారు. అతిపెద్ద పారిశ్రామికవాడైన జీడిమెట్ల పారిశ్రామిక వాడలో నాడు కార్మికుల ఆకలిని తీర్చిన వ్యక్తి గుమ్మడి ఆంజనేయులు అని, షాపూర్ నగర్ మార్కెట్ ఏర్పాటుకు ఆయన చేసిన కృషి, సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ బట్ట కృష్ణ, బొడ్డు వెంకటేశ్వర్ రావు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, డివిజన్ జనరల్ సెక్రటరీ సిద్ధిక్, నాయకులు చెక్క సురేష్, బర్ల శీను, సాయి బాబా, పలువురు నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు 13 మేకలు మృతి

*ప్రభుత్వం ఆదుకోవాలి అంటున్న మేకల కాపరి*



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్, పిడుగుపాటుకు 13 మేకలు మృతి చెందాయి అంబేద్కర్నగర్ నివాసి కేసు పాక శ్రీను మేకల కాపరి రాఘవాపురం రహదారి వెంబడి జమాల్ తోటలో మేకలు మందని మేపుతుండగా భారీ వర్షం కురుస్తుంది ఇంతలోనే ఒక్కసారిగా పిడుగు పడి 13 మేకలు మృతి చెందాయి గ్రామా ప్రజలు ఒక్కొక్క మేకకు 20,000 రూపాయలను మేకల కాపరి కేసు పాక,శ్రీనుకు ప్రభుత్వం నష్టిపరహారం అందించాలని కోరుతున్నారు

# అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

*భక్తిశ్రద్ధలతో ఘట్టాల ఊరేగింపులు.*
*అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా గణేష్ నేత*



**కూకట్ పల్లిజులై 21(వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఆషాడమాస బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని జిల్లా గణేష్ నేత దర్శించుకున్నారు. ఆల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలో గల ఎల్లమ్మ, పోచమ్మ, మహంకాలమ్మ, మరెమ్మ, నాగమ్మ దేవాలయాల్లో నిర్వహించిన ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు అమ్మవారి దర్శనం చేసుకొన్న సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండేవిదంగా అమ్మవారి చల్లని చూపు మన అందరి పైన ఉండాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్,సంగమేష్,రవీందర్, యాదగిరి శ్రీను, జనార్ధన్, మల్లేష్, నాగరాజు,రవి వెంకటకృష్ణ రాజు నరేష్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి పలువురి శుభాకాంక్షల వెల్లువ

**కూకట్ పల్లిజూలై 21 (వార్తాప్రభ)**తెలంగాణ రాష్ట్ర చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి శేరిలింగంపల్లి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కు బోనాల జాతర శుభాకాంక్షలు తెలుపుతూ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ఎమ్మెల్యే గాంధీ నివాసంలో ఎంపీని కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీకాంత్ శ్రీనివాస్ సంజీవరెడ్డి రాజు యాదవ్ శ్రీధర్ రావు లక్ష్మయ్య మల్లయ్య తదితరులు ఎంపీని కలిసి అభినందనలు తెలిపారు.



# అగర్వాల్ సమాజ్ సభ్యత్వాన్ని పెంచుతాం

- తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా
- అగర్వాల్ సమాజ్ తెలంగాణ సభ్యుల కార్యనిర్వాహక కమిటీ తొలి సమావేశం






**హైదరాబాద్ :జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అగర్వాల్ సమాజ్ సభ్యత్వాన్ని పెంచుతామని తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అన్నారు. రాఘవ్ రత్న టవర్లో ఉన్న అగర్వాల్ సమాజ్ మీటింగ్ హాల్లో అగర్వాల్ సమాజ్ తెలంగాణ కేంద్ర కమిటీ సభ్యుల కార్య నిర్వాహక కమిటీ తొలి సమావేశం జరిగింది. అగ్రసేన్ మహారాజ్ పూజతో సమావేశం ప్రారంభమైన తర్వాత సమాజ కార్యదర్శి వికాస్ కుమార్ కేశన్ సమాజ పదాధికారులను వేదికపైకి ఆహ్వానించి సమావేశానికి హాజరైన కేంద్ర కమిటీ సభ్యులందరికీ స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా అందరికీ స్వాగతం పలికి అగర్వాల్ సమాజ్ భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. సభ్యత్వ ప్రచారాన్ని పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. టీంను గెలిపించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి గత సమావేశ నివేదికను సమర్పించి ఆమోదం పొందారు. ఆయన నామినేటెడ్ సభ్యులను ప్రకటించారు. ఇందులో సికింద్రాబాద్ ప్యారడైజ్ శాఖ నుండి సురేష్ టాండన్, ఆబిడ్స్ శాఖ నుండి సూర్య కమల్ గుప్తా, హైదర్గూడ నుండి రితేష్ అగర్వాల్, శాలిబండ శాఖ నుండి ప్రేమ్ అగర్వాల్లను కేంద్ర కమిటీ నామినేటెడ్ సభ్యులుగా తీసుకున్నారు. సమాజం ఏర్పాటు చేసిన 41 కమిటీల గురించి ఆయన సమాచారం ఇచ్చారు.సమాజ ఉపాధ్యక్షుడు రూపేష్ కుమార్ అగర్వాల్ కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు , కేంద్ర కమిటీ సభ్యుల చేత ప్రమాణం చేయించారు.ఈ సమావేశంలో సమాజం వివిధ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. ఇందులో సభ్యత్వ రుసుమును ఒక సంవత్సరానికి రూ. 350 నుండి రెండు సంవత్సరాలకు రూ. 21కి తగ్గించడంపై చర్చ జరిగింది. ఆ తర్వాత సభ్యత్వ రుసుమును నిర్ణయించే/మార్చే హక్కు %ఖ.ా%.కి ఉంటుంది. అగర్వాల్ సమాజ్ ఎన్నికలలో కేంద్ర కమిటీ యొక్క నిష్క్రమించే అధ్యక్షుడికి, మాజీ అధ్యక్షుడికి, శాఖ యొక్క నిష్క్రమించే అధ్యక్షుడికి ఓటు హక్కు కల్పించడం, కుటుంబంలో 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి సభ్యత్వం తప్పనిసరి చేయడం, 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు (మైనర్లు) ఉన్నవారికి ఉచితంగా సభ్యత్వం కల్పించడం వంటి సమస్యలపై చర్చ జరిగింది. సమాజంలోని సభ్యులందరితో కలిసి పనిచేస్తున్న ఉద్యోగుల కోసం ప్రివిలేజ్ కార్డును అందించడం, రాజ్యాంగంలోని ఆర్టికల్ నంబర్ 3 సవరణ, కొత్త కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించిన 30 రోజులలోపు మొదటి కేంద్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించడం వంటి సమస్యలను కూడా సమావేశంలో చర్చించారు.సమావేశంలో అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షుడు రూపేష్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి వికాస్ కుమార్ కేసన్, సహ–కార్యదర్శి డాక్టర్ సీమా జైన్, కోశాధికారి అచల్ గుప్తా, నిష్క్రమించే అధ్యక్షుడు మనీష్ కుమార్ అగర్వాల్, %ఖ.ా%. సభ్యులు మనోజ్ మిట్టల్, సుశీల్ జేజాని, పూజా గుప్తా, హనుమాన్ దాస్ అగర్వాల్, నవీన్ కుమార్ అగర్వాల్, అరవింద్ కేడియా, రాకేష్ కుమార్ అగర్వాల్, రాకేష్ కుమార్ గనేరివాల్, పవన్ కుమార్ తిబ్రెవాల్, నవల్ కిషోర్ అగర్వాల్, అశోక్ కుమార్ అగర్వాల్, దుర్గా ప్రసాద్ బన్సల్, విజయ్ కుమార్ జైన్, నరేష్ గోయల్, సతీష్ కుమార్ గోయల్, అనిల్ కుమార్ గార్గ్, సంతోష్ టాంటియా, సురేష్ అగర్వాల్, రాకేష్ పచెరియా, సజ్జన్ అగర్వాల్, రాజేంద్ర శశి, విపిన్ కుమార్ అగర్వాల్, అజయ్ అగర్వాల్, అనిల్ అగర్వాల్, మహేంద్ర అగర్వాల్, ముఖేష్ అగర్వాల్, రమేష్ చంద్ర అగర్వాల్, సుభాష్ అగర్వాల్, రాజేంద్ర కుమార్ అగర్వాల్, రితేష్ అగర్వాల్, అను కేడియా, రోహిత్ జైన్, సతీష్ కుమార్ అగర్వాల్, రామ్ గోపాల్ దాదవాలే, సునీల్ కుమార్ కేడియా, పవన్ టిబ్దేవాల్, హేమచంద్ గుప్తా, సందీప్ మిట్టల్, శివశంకర్ బాగారియా, సుమన్ గుప్తా, నరేంద్ర కుమార్ గోయల్, మహిళా విభాగానికి చెందిన బీనా అగర్వాల్, శ్రీమతి నిధి అగర్వాల్, బరా? అగర్వాల్, శ్రీమతి అర్చన అగర్వాల్, కమలేష్ అగర్వాల్, సునేనా నర్సరియా, ఆర్తి అగర్వాల్, శ్రీమతి ప్రియాంక డోకానియా, సుమన్ అగర్వాల్, యువజన విభాగం నుండి మెహక్ సంఘీ, రజత్ కేడియా, కనక్ అగర్వాల్, ప్రత్యేకంగా ఆహ్వానించబడిన మహేంద్ర ప్రసాద్ అగర్వాల్, పవన్ కుమార్ అగర్వాల్, ప్రేమ్ అగర్వాల్, రితేష్ అగర్వాల్, రాజ్కుమార్ అగర్వాల్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

# న్యాయవాది డా. శ్రీనివాస్ కావేటికి ఆక్స్ ఫర్డ్ విశ్వ విద్యాలయ ప్రతిష్టాత్మక నెల్సన్ మండేలా అవార్డు





**హైదరాబాద్ : జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కావేటి లా ఇంటర్నేషనల్ ప్రధాన భాగస్వామి, ప్రమోటర్ అయిన ప్రముఖ అంతర్జాతీయ న్యాయవాదిడా. శ్రీనివాస్ కావేటికి, నెల్సన్ మండేలా ఇంటర్నేషనల్ డే సందర్భంగా ప్రఖ్యాత ఆక్స్ఫర్డ్ విశ్వవిద్యాలయంవారు, యునైటెడ్ కింగ్ డమ్ లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో నెల్సన్ మండేలా అవార్డు, ఆక్స్ఫర్డ్ మేయర్, లుబ్నా అర్షద్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇది అంతర్జాతీయ మానవహక్కులపరిరక్షణ, అంతర్జాతీయ న్యాయ సంస్కరణలు, సామాజిక న్యాయ ఉద్యమాల్లో డా. కావేటి చేసిన విశేష కృషికిగుర్తింపుగా లభించింది.చట్ట పాలనను నిలబెట్టేందుకు , ప్రపంచవ్యాప్తంగా న్యాయసేవలు అందరికీ అందుబాటులో ఉండేలాచేయడంలో ఆయన రాజీ లేకుండా చేసిన అనేక దశాబ్దాల అవిరామకృషికి ఫలితంగా ఆయనకు ఈ గౌరవం లభించింది.ఈ వేడుకకు ప్రత్యేకంగా 72వ అంతర్జాతీయ మిస్ వరల్డ్ పోటీలకు ఫ్రాన్స్ తరపున పారిస్ నుండి విచ్చేసినమిస్ ఫ్రాన్స్ అగాథే కౌయే మరియు మిస్ గ్రీస్ స్టెల్లా మిచైలిడూ హాజరయ్యారు.మిస్ అగాథే కౌయే, స్టెల్లా మిచైలిడూ, నెల్సన్ మండేలా సిద్ధాంతాల పట్ల సంఘీభావం వ్యక్తం చేయడమే కాక, ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ గొంతుకలను జతచేశారు. వారి హాజరు వల్ల ఐక్యత,సానుభూతి మరియు న్యాయానికి నిలువెత్తు ప్రతీకగా ఉన్న మండేలా డే భావన మరింత బలపడింది.ఈ సందర్భంగా డా. కావేటి మాట్లాడుతూ "నెల్సన్ మండేలా పేరుతో ఈ అవార్డు పొందడం తనకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు.నా బాధ్యతల్ని ద్విగుణీకృతం చేసిందన్నారు. భారతీయ వారసత్వం గల నేను యుకె లో ఈ అవార్డు పొందడం ఎంతో గర్వంగా ఉంది. మండేలా వారసత్వంమనకు ఒక విషయాన్ని గుర్తుచేస్తుంది – న్యాయానికి రాజీ లేదు, చట్టరంగం లోని మన కృషి అణగారినవర్గాలకు బలమైన స్వరమివ్వాలి." అన్నారు.కావేటి లా ఇంటర్నేషనల్ డా. కావేటి విజన్ కు వెన్ను దన్నుగా నిలుస్తూ, నైతిక న్యాయవాదన ప్రపంచ న్యాయ సహకార లక్ష్యాల సాధనలో ఆయన అచంచల నిబద్ధతకు అలుపెరుగని మద్దతిస్తూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండగ.

*శాసనసభ్యులు అరికెపూడి గాంధీ*



**శేరిలింగంపల్లి,జులై 21 (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తార నగర్ లో గల శ్రీ తుల్జాభవాని అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో బోనాల ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ఫలహారం బండి కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా ప్రజలందరికి బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని,అమ్మ వారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకుంటున్నాను అని,పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వాడవాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవలనే ఉద్దేశ్యం తో నియోజకవర్గం లోని ప్రతి గుడికి బోనాల నిధులు మంజూరయేలా కృషి చేశానని,బోనాలు అంగరంగ వైభవంగా జరుపుకునేల బోనాలు నిర్వహించుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుచేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నాని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాల వారు అంగరంగా వైభవంగ పండుగల జరుపుకునేల కృషి చేస్తున్నారు అని,పీఏసీ చైర్మన్ గాంధీ తెలిపారు.తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు తీసుకెలుతున్నారని పీఏసీ చైర్మన్ గాంధీ కొనియాడారు.బోనాల సందర్భంగా ప్రతి గుడి వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేశామని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ అన్ని రకాల వసతులు కలిపిస్తూ ప్రశాంత వాతావరణం కలిపించామని,బోనాలు ఎంతో అంగరంగ వైభవంగా జరిగేల అన్ని ఏర్పాట్లను చేశామని, బోనాల పండుగ మంచి ప్రశాంత వాతావరణంలో జరిగేవిదంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు మరియు కార్యకర్తలు,మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసిపి పింగళి నరేష్ ను కలిసిన వై భాస్కర్ రెడ్డి



**కూకట్ పల్లి జూలై 21(వార్తాప్రభ):** బాలానగర్ ఏసిపి గా నూతన పదవీ బాధ్యతలు చేపట్టిన పింగళి నరేష్ రెడ్డి నీ తెలంగాణ స్టేట్ ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ క్షణం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన ప్రకటించారు. తన దృష్టికి వచ్చే ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించడానికి పోలీసులు సిద్ధంగాఉండేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల మెరుగుదలకు కృషి జరుగుతుందని ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రమణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా స్విమ్మింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్గా హైదరాబాద్




**హైదరాబాద్ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):** హైదరాబాద్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లా స్విమ్మింగ్ ఛాంపియన్షిప్లో హైదరాబాద్ జిల్లా 355 పాయింట్లతో ఓవరాల్ ఛాంపియన్గా నిలిచింది. రెండు రోజుల పాటు గచ్చిబౌలి లోని జీఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు స్పాన్సరర్ గా వ్యవహరించిన 7సీస్ ఎంటర్టైన్మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ శ ఎల్ ఎం శంకర్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టిఎస్ఎ అధ్యక్షుడు, కార్యదర్శి జి.ఉమేష్, ఎ.శ్రీనివాస్, ఎస్.గిరిధర్ రావు హైదరాబాద్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి హాజరయ్యారు.

తెలంగాణ అభివృద్ధి పథంలో నడవాలి

# గెజిటెడ్ ఆఫీసర్ నేత ఎం.బి. కృష్ణ యాదవ్ ప్రత్యేక పూజలు



**హైదరాబాద్, జులై 21 (నేటి మనదేశమ్):** బోనాల పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరం లోని పలు ఆలయాల్లో ( కట్ట మైసమ్మ సఫిల్ గూడ,రాంనగర్ నల్ల పోచమ్మ, ఉజ్జయిని మహంకాళి, సికింద్రాబాద్ ) అమ్మవారికి హైదరాబాద్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్య బోయిన కృష్ణ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి పదంలో నడవాలని, రాష్ట్రం లో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతులు,అధికారులు, ఉద్యోగులు జీవితాల్లో వెలుగులు నింపాలని అమ్మ వారిని కోరీనట్లు తెలిపారు. అభిమానం కనపరిచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ నిర్వాకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# సూరారం వివేకానంద నగర్ నుండి కావడి యాత్ర



**కుత్బుల్లాపూర్ జూలై 21 (వార్తాప్రభ)** : కుత్బుల్లాపూర్ సూరారం డివిజన్ వైస్ ప్రెసిడెంట్ సరోజ ఆధ్వర్యంలో సోమవారం కావడి యాత్ర వివేకానంద నగర్ శివాలయం నుండి ప్రారంభమై శాపూర్ నగర్ మీదుగా సూరారం శివాలయం వరకు యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా అధ్యక్షులు డా.ఎస్ మల్లారెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బక్క శంకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేష్, లీగల్ సెల్ శివానంద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు రేవతి సింగ్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ సిద్దార్థ్, వనమాల,శివ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శ్రీగణేష్ పై దాడికి యత్నం

**హైదరాబాద్, జూలై 21 (వార్తాప్రభ)**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై గుర్తుతెలియని వ్యక్తులుదాడికి ప్రయత్నించారు. తార్నాక లోని ఆర్టీసీ హాస్పటల్ సమీపంలో ఎమ్మెల్యే వాహనంపై కొంతమంది దుండగులు దూసుకువచ్చారు. అడ్డుకోబోయిన గన్ మెన్ ల చేతిలో నుంచి వెపన్స్ లాక్కోవడానికి ప్రయత్నించారు. దుండగుల బారి నుంచి తప్పించుకుని ఓయూ పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ , పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చారు.

# ఎడిటోరియల్

## పిఠాపురం వైసీపీలో సంచలనాలు నమోదవుతాయా ?

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జనసేన బలంగా తయారు అయింది. ఎందుకు అంటే అక్కడ నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. పైగా ఆయన ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక పిఠాపురంలో జనసేన టీడీపీ కూటమి కట్టాయి. బీజేపీ మద్దతు ఉంది. దాంతో 2024లో వార్ వన్ సైడ్ అయింది. ఇపుడు కూడా అలాగే సీన్ ఉంది. పైగా 2019 నుంచి 2024 దాకా వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగిన పెండం దొరబాబు ఎన్నికల అనంతరం జనసేనలోకి తన అనుచరులతో కలసి చేరిపోయారు. దాంతో వైసీపీ బలహీనపడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో పిఠాపురం నుంచి 2024 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి పవన్ చేతిలో ఓటమి పాలు అయిన వంగా గీత గురించి అంతా చర్చించుకుంటున్నారు.ఆమె వైసీపీ తరఫున పెద్దగా కార్యక్రమాలు నిర్వహించడంలేదు అని అంటున్నారు. వైసీపీ రాష్ట్ర శాఖ ఏ పిలుపు ఇచ్చినా పిఠాపురంలో మొక్కుబడిగా సాగుతున్నాయని అంటున్నారు. దానికి కారణం ఆమె పెద్దగా ఆసక్తిని చూపించడంలేదు అని అంటున్నారు. పిఠాపురంలో జనసేన బలంగా ఉండటం మరో కారణంగా చెబుతున్నారు. ఇంకా కూటమికి నాలుగేళ్ల వరకూ అధికారం ఉంటుంది మధ్యలో ఆందోళనలు చేస్తే టార్గెట్ అవుతామని చాలా మంది వైసీపీ నేతలు కూడా తెర చాటు అవుతున్నారు.దాంతో వంగా గీత సైతం డీలా పడుతున్నారని అంటున్నారు. ఇక వైసీపీ ఎత్తిగిల్లకపోవడంతో పాటు ఆ పార్టీ పెద్దల చూపు టీడీపీ ఇంచార్జి అయిన వర్మ మీద ఉండడం కూడా ఆమెను పునరాలోచన పడేలా చేస్తోంది అని అంటున్నారు. తాను ఎంత తెగించి పోరాడినా 2029 ఎన్నికల నాటికి ఎవరు వచ్చి టికెట్ అందుకుంటారో తెలియని నేపథ్యంలో ఎందుకొచ్చిన గోడు అని ఆమె గమ్మున ఉంటున్నారు అని అంటున్నారు.ఇక మరో వైపు జరుగుతున్న ప్రచారం ఏమిటి అంటే పిఠాపురం వర్మ వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ వైపు వస్తారని. ఆయనకు పవన్ ఉండగా ఎమ్మెల్యేగా కూటమి నుంచి పోటీ చేసే చాన్స్ దక్కదని అంటున్నారు. దాంతో ఆయనను లాగే ప్రయత్నాలు వైసీపీ మొదలెట్టింది అని అంటున్నారు. వర్మ వస్తే ఆయన వైపు ఉన్న అతి పెద్ద వర్గం కూడా వైసీపీ వైపు వస్తుందని అలా పార్టీ స్ట్రాంగ్ అవుతుందని పవన్ కి యాంటీగా పోటీ చేసే సత్తా వర్మకు ఉందని వైసీపీ నమ్ముతోంది. అందుకే ఆయనకు అనేక హామీలు ఇచ్చేందుకు సైతం సిద్ధపడుతున్నారు అని అంటున్నారు.ఇక వర్మ సైతం కూటమిలో అసంతృప్తిగా ఉన్నారని అంటున్నారు. మరి ఈ పరిణామాలు ఇలా సాగుతూండగానే వంగా గీత గతంలో ప్రజారాజ్యం లో పనిచేయడంతో పాటు మెగాస్టార్ చిరంజీవి కుటుంబంతో మంచి పరిచయాలు ఉండడంతో కచ్చితంగా ఆమె జనసేన వైపు వస్తారని అంటున్నారు. అందుకే ఆమె పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా ఆసక్తి చూపించడం లేదు అని అంటున్నారు.

## శ్రీ అగస్త్య విరాళం



కాకినాడ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)హాకీ, ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహణకు శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ తరుపున రూ.1లక్ష విరాళం అందించారు.దీనికి సంబంధించిన చెక్కును శ్రీ అగస్త్య ఛైర్మన్ డి.నాగేశ్వరరావు జిల్లా కలెక్టరు షాన్ మోహన్ కు అందజేశారు.

## జీవన ఎరువులతో పంటకు బలం

- పచ్చిరొట్ట పైర్లతో 25 శాతం వరకు ఎరువులు ఆదా
- అన్నదాతలూ.. అవగాహన పెంచుకొని అడుగేయండి
- పెట్టుబడుల ఖర్చును తగ్గించి సాగును లాభసాటిగా మార్చుకోండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులను ఆదా చేయొచ్చని.. అదేవిధంగా పచ్చిరొట్ట పైర్ల ఎరువులను వాడటం ద్వారా 25 శాతం ఎరువులను ఆదా చేయొచ్చని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి పచ్చిరొట్ట పైర్లు, జీవన ఎరువుల ప్రయోజనాలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లతో నేలసారం పెరుగుతుందని, నేలలో పోషకాల వృధా తగ్గుతుందన్నారు. ఆరోగ్యకర నేల వల్ల ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులు లభిస్తాయన్నారు. అదేవిధంగా రైజోబియం, అజోటోబాక్టర్, అజోస్పైరిల్లం, బ్లూ గ్రీన్ ఆల్గే, అజోల్లా, మైకోరైజా వంటివి వాతావరణ నత్రజనిని మట్టిలో నిలిపి మొక్కకు ఉపయోగపడేలా చేస్తాయన్నారు. జీవన ఎరువులు వినియోగించేటప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని పాటించాలన్నారు. ఈ జీవన ఎరువుల కాలపరిమితి 6-12 నెలలు ఉంటుందని, రసాయనిక ఎరువులు, కీటకనాశకాలతో కలిపి వేయకూడదని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వాడటం మంచిదని, ఈ అంశాలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అన్నదాతలకు అవగాహన కల్పించాలని, ఇందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. పెట్టుబడుల ఖర్చును తగ్గించుకొని సాగును లాభసాటిగా మార్చుకోవడంలో రైతులను చేయిపట్టి నడిపించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



# పీఎం సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ ఆదా

● ప్రభుత్వ రాయితీలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి ● సోలార్ వ్యవస్థను ప్రారంభించిన మంత్రి సుభాష్



**కాజులూరు,జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్ను ఆదా చేసుకొని ప్రజలు లబ్ధి పొందాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెంలో గుబ్బల సోమ సుందరిమణి అనే గృహిణి పీఎం సూర్య ఘర్ పథకం కింద ఏర్పాటు చేసుకున్న మూడు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ వ్యవస్థను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ రాయితీ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకొని మేలు పొందాలన్నారు. గొల్లపాలెం కు చెందిన మహిళ రెండు లక్షల పదివేలతో సోలార్ సిస్టమ్ ను ఏర్పాటు చేసుకోగా దానిలో 78 వేలు ప్రభుత్వ సబ్సిడీగా లభిస్తుందని అన్నారు. పీఎం సూర్య ఘర్ పథకంలో ప్రభుత్వం ఒక కిలోవాట్కు 30 వేలు, రెండు కిలోవాట్లకు 60 వేలు, మూడు కిలోవాట్లకు 78, వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వ రుణం పొందవచ్చును అన్నారు. అంతేకాకుండా ఎస్సీలకు ఈ పథకాన్ని ఉచితంగా అమలు చేస్తుందని తెలిపారు. డ్వాక్రా మహిళలకు కూడా స్త్రీ నిధి పథకం కింద రుణం మంజూరు చేస్తారని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో విద్యుత్ ఆదా చేసేందుకు, విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు పీఎం సూర్యగర్ పథకం ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె. రాంబాబు, డిఈ ఎన్ ఉదయభాస్కర్, డిఈఈ కె. మురళీమోహన్, ఏ ఈ వీర్రెడ్డి, పలువురు అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కలిసి రండి ..

అభివృద్ధి పనుల శంకుస్థాపనలోఎమ్మెల్యే సుజనా చౌదరి..





**విజయవాడ పశ్చిమ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి పిలుపునిచ్చారు .పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి స్పష్టం చేశారు.. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి మరిన్ని అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే సుజనా కోరారు. సోమవారం 56 వ డివిజన్ పాత రాజా రాజేశ్వరి పేట లోని జేపీ అపార్ట్మెంట్ డీ బ్లాక్ నుండి స్కై మెడికల్ అండ్ ఫాన్సీ షాప్ వరకు రూ 49.95 లక్షల నిధులతో 690 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, లైన్ నిర్మాణ పనులను , మహంకాలమ్మ టెంపుల్ జంక్షన్ నుండి రైల్వే గేటు వరకు పెవర్ బ్లాక్స్ తో రహదారి విస్తరణకు రూ 48 .23 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఎర్ర కట్ట డౌన్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కూటమి నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం సుజనా చౌదరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జేపీ అపార్ట్మెంట్ నివాసితులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్లు , డ్రైనేజీల ను నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే అప్రోచ్ రోడ్, వాటర్ ట్యాంక్ నిర్మాణం,పార్క్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు .పశ్చిమ లోని మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తున్నానన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని అనంతరం అందరం కలిసి సమిష్టిగా ప్రజాసేవలో భాగస్వామ్యులం కావాలన్నారు. ఎన్నికల్లో చెప్పిన ప్రతి పని చేస్తున్నామని తెలిపారు.. వైసీపీ కార్పొరేటర్లు అభివృద్ధికి సహకరించాలని కోరారు .అభివృద్ధి విషయం లో రాజకీయాలకతీతంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. బుడమేరు ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పశ్చిమ ప్రజలకు ఎల్లవేళలా ఎన్డీఏ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈ ఈ జే శ్రీనివాస్, డీ ఈ మాధవి, ఏ ఈ జాస్మిన్,కార్పొరేటర్లు బుల్లా విజయ్, యలకల చలపతిరావు, టీడీపీ అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, సయ్యద్ రఫీ, కూటమి నేతలు కోగంటి రామారావు, దనేకుల సుబ్బారావు, వరప్రసాద్, పెద్ది శ్యామ్ సుందర్,రౌతు వాసు, నున్నా కృష్ణ, దేవకి, రెడ్డిపల్లి రాజు, పైలా సురేష్, జేపీ అపార్ట్మెంట్ వాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు..

# 3600 అడుగులు జాతీయ జెండా తో పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ



**విజయవాడ పశ్చిమ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పొట్టి శ్రీరాములు,చలవాది మల్లికార్జునరావు కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్‌టెక్నాలజీ (అటానమస్)లో ఎన్ సి సీ యూనిట్ సహాయంతో విజయవాడలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్తో కలిసి సోమవారం 3600 అడుగులజెండా ర్యాలీని నిర్వహించారు.ఈ ర్యాలీలో దాదాపు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్లోని విజయవాడలో ఒక ముఖ్యమైన దేశభక్తి కార్యక్రమం జరిగింది. భారతదేశ 79వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ర్యాలీలో 3,600 అడుగుల పొడవైన జాతీయ జెండాను తమ భుజ స్కంధాలపై మోశారు. ఈ ర్యాలీ భవానీపురం నుండి ప్రారంభమై 1.5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి స్వాతి సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులునిర్వహించారు. పాల్గొనేవారిలో జాతీయ గౌరవం మరియు ఐక్యతను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు స్థానిక నివాసితులు ఉత్సాహంగా పాల్గొన్నారు, వారు సమిష్టిగా భారీ త్రివర్ణజెండాను పట్టుకుని నగర వీధుల గుండా కవాతు చేశారు. ఈ ర్యాలీ దేశ స్వాతంత్ర్యానికి నివాళిగా మాత్రమే కాకుండా, మతసామరస్యాన్ని దృశ్యమానంగా కూడా చూపించింది. ఈ ర్యాలీ జాతీయ మైలురాళ్లను గొప్పతనం మరియు ఐక్యతతో జరుపుకోవడంలోసమాజం యొక్క అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుంది.కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.ఎ. చిట్ట అమర్ సుధీర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణ కుమార్ ,ఎన్ సి సి పి ఓ బి.శ్రీకాంత్ రెడ్డి , అన్ని విభాగాల హెచ్ఓడిలు మరియు కళాశాల నుండి అన్ని ఎన్ సి సి కో-ఆర్డినేటర్లు పాల్గొనిగొప్పగా విజయ వంతం చేశారు.

# రికార్డు స్థాయిలో తల్లికి వందనం అమలు చేసిన కూటమి ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత





**ఇబ్రహీంపట్నం, జూలై 04 21(వార్తా ప్రభ ప్రతినిధి):**దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని రికార్డు స్థాయిలో అమలు చేసిందని, ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని, ఇందుకోసం దాదాపు పదివేల కోట్లకు పైగా తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఇతరత్రా సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అంటూ ఆరా తీశారు. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సమస్యలను పలువురు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎస్ ఎస్ డి సి జాబ్ మేళా పోస్టర్ విడుదల



**విస్సన్నపేట జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక వికాస్ పీజీ కాలేజీ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు కేశినేని ఫౌండేషన్ సంయుక్త సారథ్యంలో జాబ్ మేళా కార్యక్రమం జరగనున్నట్లు ఎంపీడీవో చిన్న రాట్నాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెగా పోస్టర్ ను విడుదల చేశారు.

## మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన

సంఘం సర్కిల్ ఇన్స్పెక్టర్ వేమారెడ్డి



**చేజర్ల జూలై 21 (వార్తాప్రభ)** మండలంలోని పెరుమళ్ళపాడు ప్రాథమిక పాఠశాలలో ఉమెన్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ వేమారెడ్డి బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విపులంగా వివరించారు.మహిళల భద్రత అవగాహన హక్కులపై కూడా విద్యార్థులకు ప్రేరణాత్మకంగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.పిల్లల్లో జాగ్రత్తలు ఆత్మరక్షణపై అవగాహన పెంచేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగపడిందని ఉపాధ్యాయులు తెలిపారు.

## అమ్మవారి అన్న ప్రసాద పథకానికి లక్ష రూపాయలు బహుకరణ



**విజయవాడ పశ్చిమ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బెజవాడ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ అన్న ప్రసాద విభాగానికి ఆలయ మాజీ ధర్మకర్త కేసరి కృష్ణారెడ్డి నాగమణి ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద పథకానికి కేసరి శ్రీనివాసరెడ్డి సతీమణి విజయలక్ష్మి కుమార్తె నీవిద, తల్లిదండ్రులు సుబ్బారెడ్డి రాజేశ్వరి పేరున రూ.1,01,116 లను అమ్మవారి ఆలయానికి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన దాత కుటుంబ సభ్యులకు ఆలయ ఏఈవో ఎన్ రమేష్ బాబు ఆశీర్వచనాన్ని వేద పండితులతో అందజేశారు. అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందించారు.

## ఇబ్రహీంపట్నం పీఏసీఎస్ ఛైర్మన్ గా కోయ నెహ్రూ

కమిటీ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



**ఇబ్రహీంపట్నం,జూలై 21(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ హాజరయ్యారు .పీఏసీఎస్ ఛైర్మన్ గా కోయ నెహ్రూ నియామకమయ్యారు. జమలయ్య,నడకుదిటి విఘ్నేశ్వరరావు చైర్పర్సన్లుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన త్రిసభ్య కమిటీకి ఎమ్మెల్యే వసంత శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విశేషంగా సేవలను అందించాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ఆరంభం నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతుల అభ్యున్నతి ప్రధాన ధ్యేయంగా కృషి చేయాలన్నారు. సొసైటీని ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు తోడు సొసైటీ ద్వారా రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కు పితృ వియోగం.



**మచిలీపట్నం జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం లో గత కొన్ని సంవత్సరాలుగా వార్తలను సేకరిస్తూ ప్రజలకు అందిస్తున్న ఐ న్యూస్ జర్నలిస్ట్ షేక్ షరీఫ్ పితృ వియోగం కలిగింది. జర్నలిస్ట్ తండ్రి షేక్ కన్నన్ సాహెబ్ (75)ఆదివారం రాత్రి అనారోగ్య కారణంగా మృతి చెందారు. ఆయన గతంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ పొందారు. పదవి విరమణ పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల వయోభారంతో శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ స్వగృహమందు తుది శ్వాస విడిచారు. వివాదరహితుడుగా పేరుపొందిన షేక్ కన్నన్ సాహెబ్ మృతి పట్ల నగరంలో పలువురు శ్రద్ధాంజలి ఘటిస్తూ కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. కన్నన్ సాహెబ్ అంత్యక్రియలు సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలతో ఖననం చేశారు.

# అక్షర శక్తి ముందు తూటా శక్తి నిలవలేదు..

● కవులు, రచయితలకున్న శక్తి అసామానం ● సృజనాత్మక రచనలో పోటీలు నిర్వహిస్తాం ● నేటి తరం కవులలో రచనా ప్రతిభను వెలికితీసేందుకు సమష్టి కృషి అవసరం ● ప్రణామం కవి సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ







**విజయవాడ పశ్చిమ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మేధో వికాసం మానవ ఉనికికి అంతిమ లక్ష్యం కావాలన్న డా. బీఆర్ అంబేడ్కర్ సూక్తి. ని నిజం చేస్తూ భావి తరానికి వెలుగుబాట వేసేలా మంచి ఆలోచనలకు సలక్షణంగా అక్షర రూపమివ్వడం ఓ కళ అని.. అయితే నేటి తరంలో ఆ రచనా శక్తి, ఆసక్తి తగ్గుతోందని.. విద్యార్థి దశ నుంచే సృజనాత్మక రచనా నైపుణ్యాలను పెంచేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు.విజయవాడ బందరురోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ఆవరణలో ఆదివారం మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ ఆధ్వర్యంలో 'ప్రణామం' కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలకున్నశక్తి అసామాన్యమైనదని, వారి కలం నుంచి జాలువారిన అక్షర శక్తి ముందు తూటా శక్తి కూడా నిలవలేదని పేర్కొన్నారు. అర్థవంతమైన రచనలు సమాజ దిశను దశను మార్చుతాయని, సమాజంలోఎన్నో విప్లవాత్మక మార్పులకు కలం, గళమే కారణమని అన్నారు. నేటి తరంలో రచనా నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక ప్రకారం కృషిచేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి ప్రత్యేక పోటీలు నిర్వహించి, ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. ఎవరూ చదవడం లేదని రచయితలు బాధపడాల్సిన అవసరం లేదని.. మీరు రాయడం మానేస్తే చరిత్రలో తప్పకుండా శూన్యం ఏర్పడుతుందన్నారు. సమాజంలోని వివిధ సమస్యలపై రచయితల నుండి రచనలు ఆహ్వానించి ఉత్తమ రచనల్ని ఎంపిక చేసి వాటిని ఒక పుస్తకంగా ముద్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ బాధ్యతను మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ తీసుకోవాలన్నారు. స్మృతివనం లాంటి గొప్ప ప్రదేశాల్లో ఇలాంటి గొప్ప సాహితీ కార్యక్రమాలు మరెన్నో జరగాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

కార్యక్రమంలో సుప్రసిద్ధ కవులు శ్రీరామకవచం సాగర్, డాక్టర్ ఎం.ప్రభాకర్, వ్యాఖ్యాన శిరోమణి వేముల హజరత్తయ్య గుప్తా, సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయ్ కుమార్, నవ మల్లెతీగ సకుటుంభ సాహిత్య మాసపత్రిక సంపాదకులు కలిమిశ్రీ, బుక్ ఆఫ్ భారత్ రికార్డ్స్ డాక్టర్ ఎస్ దుర్గాకుమార్,సీనియర్ జర్నలిస్టు యేమినేని వెంకట రమణ,తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని చొప్పా రాఘవేంద్రశేఖర్ పర్యవేక్షించగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన 80 మంది కవులు తెలుగు భాష, ప్రపంచశాంతి, పర్యావరణం, దేశభక్తి, సామాజిక చైతన్యం అంశాలపై కవితాగానం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కవులు ప్రమాణం చేశారు.

## ఎన్టీఆర్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా అవ్వారు బుల్లబ్బాయి నియామకం



**విజయవాడ పశ్చిమ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కోశాధికారిగా అవ్వారు బుల్లబ్బాయి నియమితులైయ్యారు. తనకు బాధ్యతలు ఇచ్చినందుకు మనస్ఫూర్తిగా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కి సంఘటన మంత్రి మధుకర్ జి కి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ కి తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీకి ఇప్పుడు దాకా అనేక బాధ్యతలు నిర్వహించి ఇప్పుడు తన్ను గుర్తించి మళ్లీ కోశాధికారిగా ఇవ్వడం వలన పార్టీకి మరింత కృషి చేస్తానని పార్టీ బలోపేతానికి తాను కృషి చేస్తానని అవ్వారు అన్నారు. ఒక బడుగు బలహీన వర్గాలకు చెందిన తనను ఎన్నుకోవడం చాలా ఆనందదాయకం అని చెప్పి తెలియజేసు కుంటున్నానిని ఆయన అన్నారు.

## ఒక్క అవకాశం పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్న జగన్మోహన్ రెడ్డి

### మద్యం, ఇసుక పాలసీలు అడ్డం పెట్టుకుని వేల కోట్లు దోపిడీ

### మాజీ ముఖ్యమంత్రి పై ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఘాటు వ్యాఖ్యలు

**ఇబ్రహీంపట్నం, జూలై 21(వార్తా ప్రభ ప్రతినిధి):**ఒక్క అవకాశం అంటూ 2019లో అధికారం వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఎలా దోచుకోవాలో ముందుగానే ప్లాన్ చేసుకొని,దానికి తగ్గట్లుగా మద్యం, ఇసుక పాలసీలను నిర్ణయించి వేలాది కోట్ల రూపాయలు దోచుకున్నారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై ఘాటు వ్యాఖ్యలు చేశారు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్. ఇబ్రహీంపట్నంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు.మద్యం కుంభకోణం సుమారు రూ.3,500 కోట్లు ఉంటుందని ప్రాథమిక అంచనా వేస్తున్నారని కానీ దీనికంటే ఎక్కువ మొత్తంలో దోచుకుని ఉంటారని అభిప్రాయపడ్డారు. అక్రమంగా సంపాదించిన ఈ సొమ్ముతో విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేసి ఉంటారని తెలిపారు.గడచిన ఎన్నికల్లో ఒక్క మైలవరం నియోజకవర్గంలోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాళ్లు దాదాపు రూ.55 కోట్లకు పైగా ఖర్చు పెట్టారని వెల్లడించారు. ఇక్కడ పోటీ చేసిన అభ్యర్థి ఒక సామాన్య ఆసామి అన్నారు. నియోజకవర్గంలో ఓటుకు



రూ.2వేలకు పైగా చెల్లించి ఇక్కడ ఓట్లను కొనుగోలు చేశారన్నారు. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ దాదాపు 300 కోట్లకు పైగానే ఈ విధంగా ఖర్చు పెట్టిందన్నారు. ప్రజలు ఈ విషయాలన్నీ గమనించాలన్నారు.మద్యం కుంభకోణం కారణంగా కల్తీ మద్యాన్ని విక్రయించి దాదాపు వేలాది మంది మృత్యువాత పడ్డారని అన్నారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఈడీతో మద్యం, ఇసుక తదితర కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు.

## 9వ రోజు కు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె



**ఇబ్రహీంపట్నం,జూలై 21 (వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కె జీతాల పెంపు చెయ్యాలని చేస్తున్న సమ్మె 9 వ రోజు కు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి – జీతాల పెంపు ప్రకటన విడుదల చేయాలి.ఇంజనీరింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలి.కార్మికులందరికీరిటైర్మెంట్బెనిఫిట్స్ కల్పించాలి.కార్మికుల ందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం పథకం, రేషన్ కార్డులో ఎంప్లాయ్ ఉండటం తో కుటుంబ సభ్యులకు యాడింగ్ ఆప్షన్ ఇవ్వాలని, కుటుంబ సభ్యులకు ఆపిన పింఛన్లు తక్షణమే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాము యూనియన్ నాయకులతో చర్చల జరిపి న్యాయమైన కోర్కె జీతాల పెంపు ప్రకటన విడుదల చేసి సమస్య పరిష్కరించాలి.ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (సి ఐ టి యు)నాయకులు మేస్త్రి యం వాసు, ఎలక్ట్రిషన్స్ శ్రీను, తిరుపతి రావు,నోజు,శివరామకృష్ణ, పిట్టర్ వి శ్రీను, పోతురాజు, ఆర్ శ్రీను, హనుమంత్ , దుర్గారావు,వెల్డర్ డూమ్నిక్ రాజ్, అప్పలరాజు, వాల్ ఆపరేటర్స్ నరేష్, రాజేష్, అంకరాజు ఆఫీస్ స్టాఫ్ క్రాంతి, రమాదేవి, లక్ష్మణరావు,లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి అధ్యక్షులు "చింతల" ఏక పక్ష ధోరణి పై అధిష్టానం కు ఫిర్యాదు

### ఆలయ మాజీ చైర్మన్ నూతల పాటి వెల్లడి

**పెనుగంచిప్రోలు, జులై 21( వార్త ప్ర భ)** పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చింతల వెంకటసీతారామయ్య ఏక పక్ష నిర్ణయాల పై జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ , మాజీ మంత్రి కడీసీసీ జిల్లా బ్యాంక్ ప్రెసిడెంట్ , తెలుగుదేశం జిల్లా పార్టీ ప్రెసిడెంట్ నెట్టెం రఘు రామ్ లకు తెలిపానని శ్రీ తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నాయకుడు నూతల పాటి, చెన్న కేశవరావు విలేకర్ల సమావేశంలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పెద్దలకు పెనుగంచిప్రోలు మండలంలో చింతల వెంకట సీతారామయ్య చేసే పనులు ఏక పక్షముగా ఉంటున్నవనీ,శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంనకు వచ్చే భక్తులను పాటదారులు బాధ పెడుతున్న, భక్తుల ఇబ్బందులు పట్టించుకోకుండా పాటదారులకు మద్దతుగా వ్యవహారిస్తూన్నారనీ పేర్కొన్నారు.గ్రామములో అక్రమ వ్యాపారం కూడా చింతల చెప్పిన వారే చేసుకోవాలని జులుం ప్రవర్తిస్తూన్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు ఉచిత ఇసుక అందాలని, ఇసుక విధానం ప్రవేశపెడితే ఇక్కడ కూడా ఏక పక్షంగా జేసీబీ, ప్రొక్లయినర్ లు పెట్టించి ట్రాక్టర్ లోడ్ కి 500 రూపాయలు వసూలు చేస్తున్నారని, ఇటువంటి కార్యక్రమములు మానుకోకుంటే ప్రత్యక్షముగా అడ్డగించుతానని ఎమ్మెల్యే కీ, మాజీ మంత్రి కీ తెలిపినట్లు



చెన్నకేశవరావు అన్నారు.

## రైతుల శ్రేయస్సు లక్ష్యంగా అడుగులు



**విస్సన్నపేట జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రైతన్నలకు సాగుకు అందుబాటులో ఎరువులు అందించే లక్ష్యంగా ఒకవైపు అగ్రికల్చరల్ విజిలెన్స్ అధికారులు మరోవైపు రెవెన్యూ అధికారులు తిరువూరు నియోజకవర్గంలో ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నారు. ఎరువుల స్టాకు రిజిస్టర్ ఏర్పాటు, మరోవైపు ధరల పట్టిక ఎండనకా వానకా రేయనక పగలనకా ఆరుకాలం శ్రమించే రైతన్నలు దోపిడీకి గురి కాకుండా ఎరువులు బ్లాక్ మార్కెటింగ్ నివారించే లక్ష్యంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## ఆదర్శప్రాయుడు పద్మశ్రీ మైనేని హరిప్రసాద్.

### లిటిడిపి ఆధ్వర్యంలో హరిప్రసాద్ స్వగ్రామంలో జయంతి వేడుకలు.




**అవనిగడ్డ: జులై 21(వార్తాప్రభ ప్రతినిధి)**కనీస సౌకర్యాలు కూడా లేని ఎడ్లంక గ్రామంలో పుట్టి దేశం గర్వించదగ్గ అణుశాస్త్రవేత్తగా పేరు గడించి భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్న మైనేని హరిప్రసాదరావు నేటి తరం వారికి ఆదర్శప్రాయుడు అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు.. సోమవారం పాత ఎడ్లంక గ్రామంలో మైనేని హరిప్రసాదరావు జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తో కలసి పాల్గొన్న గోవర్ధన్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా ఎడ్లంక గ్రామ అభివృద్ధికి మైనేని సేవలను కొనియాడారు. ప్రఖ్యాత డీఆర్డీవో ప్రాజెక్టు దివి ప్రాంతంలో నెల్కొల్పటం వెనుక మైనేని హరిప్రసాద్ కృషి ఎంతో ఉందని వక్తలు పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో కర్రా సుధాకర్,పాలేపు సామ్రాజ్యం,పర్చూరి దుర్గాప్రసాద్,బండే రాఘవ, మండలి రామ్మోహన్ రావు,మేడికొండ విజయ్, బచ్చు హనుమాన్, కొల్లూరి వాసు, పాలేపు వెంకటేశ్వరరావు,మైల హరిబాబు, మోదుమూడి మాధవరావు, మునిపల్లి రాజేంద్ర ప్రసాద్, పాలేపు ఉపకులు,మునిపల్లె లాజర్,తూమాటి ప్రసాద్,కమ్మిలి సుబ్రమణ్యం, కొల్లూరి ఇమ్మనియేలు, తదితరులు పాల్గొన్నారు

## వైకాపా నిరసన

**కొవ్వూరు, జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాజమండ్రి పార్లమెంట్ ఇంచార్జ్ గూడూరు శ్రీనివాస్,కొవ్వూరు ఇంచార్జ్ తలారి వెంకట్రావు, పార్టీ శ్రేణులతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు బస్టాండ్ సెంటర్లో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు..ఈసందర్భంగా మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి బదులు రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని రాష్ట్రంలో చంద్రబాబు లోకేష్ చెప్పిన విధంగా రాజ్యాంగ వ్యవస్థలన్నీ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే అమలు చేస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాయి

## కొండపల్లిలో మల్లిఖార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం, జూలై 21(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఆధ్వర్యంలో ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లిఖార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి తమ అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎదిగిన నాయకుడు మల్లికార్జున్ ఖర్గే అని,ఎంతో సాధన, పట్టుదల, ప్రజా సేవకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు.వారి నాయకత్వం లో పార్టీ అభివృద్ధి చెందాలని,వారి ఈ దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అక్కల ప్రసాద్,రాగాల రాము, చెరుకు ఆనందరావు మరియు కే లింగరాజు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కాలువలోకి దూసుకెళ్లిన బూడిద లారీ



**ఇబ్రహీంపట్నం, జూలై 21 (వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం ఖీల్లా రోడ్డులో బూడిద చెరువు నుండి బూడిద లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలంలోకి దూసుకెళ్లింది. అతివేగంగా వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి సైడ్ కలలోకి దూసుకెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కళాశాలలు నుండి విద్యార్థులు, స్కూల్ పిల్లలు తిరుగు ప్రయాణం ఇదే సమయంలో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. వర్షం కారణంగా ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టమే తప్పిందని స్థానికులు తెలిపారు. పెద్ద క్రేను, రెండు జెసిపి లు, అతి కష్టం మీద లారీని బయటకి తీసాయి. ఖీల్లా రోడ్డులో బూడిద రవాణా లారీల ఆగడాలు శ్రుతి మించి పోతున్నాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ రహదారిలో ప్రయాణం చేస్తున్నారు. స్థానికులు ఎన్నిసార్లు వీటిపిఎస్ అధికారులకు చెప్పిన వారు స్పందించకపోవడం, లారీల వేగాన్ని నియంత్రించకపోవడం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, కొండపల్లి ఖీల్లా పర్యటన కోసం వచ్చే పర్యాటకులు బూడిద లారీల వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## లాంగెస్ట్ నేషనల్ ఫ్లాగ్ ప్రెసెంటేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ డూండి రాకేష్








**విజయవాడ పశ్చిమ జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అంత్యంత పొడవైన జాతీయ జెండా వూరేగింపు సోమవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా విజయవాడ వెస్ట్ ఎసిపి దుర్గా రావు , ట్రాఫిక్ ఎసిపి రామచంద్రరావు పాల్గొన్నారు.సోమవారం వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వారు దేశంలో 9 చోట్ల ప్రదర్శించనున్న 3600 ఫీట్ నేషనల్ ఫ్లాగ్ కార్యక్రమంను మొట్టమొదటి గా విజయవాడ చర్చ సెంటర్ నుండి స్వాతి థియేటర్ వరకు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ప్రస్తుత వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ యొక్క ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎరుకుల రామకృష్ణ మాజీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్లు వంకదేవర వాసుదేవరావు , వేముల హజరతయ్య గుప్తా, డిస్ట్రిక్టు గవర్నర్లు తూనుగుంట్ల శ్రీధర్ ,అన్నం సాయి సునీత వాసవి క్లబ్ సభ్యులతో కలిసి తిరంగ రన్ డూండి రాకేష్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ప్రజా సంఘ సంస్కర్తలు, వ్యాపారస్తులు పాల్గొనడంతో కార్యక్రమం ఎంతో కోలాహలం గా జరిగింది. కార్యక్రమంలో మారం రోజా , కె ఎల్ వి సతీష్ ,మామిడి శ్రీనివాస్ , అయ్యప్ప , శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ఒబిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కాసుల రాజా శ్రీధర్

**ఆగస్టు 4,5 వ తేదీ లలో ఒబిసి రిజర్వేషన్లు సాధన కై చలో ఢిల్లీ: బీసీ నేత అంగిరేకుల వరప్రసాద్ యాదవ్**



**గుంటూరు జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అఖిల భారత ఒబిసి సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షులు గా గుంటూరు నగరంలోని నల్ల చెరువు కి చెందిన కాసుల రాజా శ్రీధర్ రాజు ను నియమిస్తూ అఖిల భారత ఒబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం స్థానిక బ్రాడిపేట లో జరిగిన విలేకరుల సమావేశంలో వరప్రసాద్ యాదవ్ రాజా శ్రీధర్ కు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒబిసి లకు కేంద్రం లో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్ట సభలల్లో ఒబిసి లకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఆగస్టు 4,5 వ తేదీ లలో చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిసి ప్రజా ప్రతినిధులుకు, బిసి విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఒబిసి విద్యార్థులకు జాతీయ ఓవర్ సిస్ స్కాలర్ షిప్ పథకం ను వర్తింపజేయాలని వరప్రసాద్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాథోడ్ సుజాను సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే శాసనసభ సమావేశాలలో బిసి ల స్థానిక సంస్థల రిజర్వేషన్లు 34%నుండి 42% కు పెంచుతూ తీర్మానాన్ని ఆమోదించాలని దీనికి సంబంధించి సిఎం నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఎన్నికైన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాసుల రాజా శ్రీధర్ రాజు మాట్లాడుతూ బిసి సామాజిక రక్షణ చట్టం అమలు కు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కోరారు. బిసి సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను వెంటనే పెంచాలని కోరారు. ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ గోవిందు మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్స్ లలో రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం కి విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఓబీసీ సంక్షేమం కోసం కృషి అభినందనీయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మండల ఓబీసీ కార్యదర్శి మగ్రి వెంకటేశ్వరరావు, జిల్లా యూత్ అధ్యక్షులు సంజయ్ పాల్గొన్నారు

# ఫొటోగ్రఫీ పోటీల ఎంట్రీలను ఈ నెల 31లోగా పంపండి

**- ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఆగస్టు 19న పురస్కారాల ప్రదానం**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా విశేష ప్రతిభకనబరిచిన ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేసేందుకు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ఈ నెల 31వ తేదీ లోపు ఎంట్రీలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఉత్తమ న్యూస్ ఫొటో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి విభాగం కింద జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్‌టీఆర్, యోగాంధ్ర అంశాలకు సంబంధించి ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం - 2 ఉన్నాయని, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ (రూ. 10 వేలు), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 4 వేలు) బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక సెక్షన్ నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు సెక్షన్ల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చని, 2024, జూన్ 12 నుంచి 2025, జులై 31 మధ్య తీసిన ఫొటోలై ఉండాలన్నారు. ఫొటో సైజు 12%*%10 ఉండాలని, ఫొటోలు ఎన్‌టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలని సూచించారు. ఒరిజినల్ ఫొటోలతో ఎంట్రీలను విజయవాడ గోపాల్‌రెడ్డి రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం ఆవరణంలో గల డీపీఆర్‌వో కార్యాలయంనందు అందజేయాలని, ఇతర వివరాలకు 9121215373 నంబర్లో సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

## జి.కొండూరులో సుపరిపాలనలో తొలిఅడుగు



**జి.కొండూరు జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:స్థానిక శాసనసభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాదు ఆదేశాలమేరకు మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామంలో టీడీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైల్వే లైన్ ఏర్పాటుకు భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టరు ఆర్.మహేష్




**అమలాపురం జూలై 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో వివిధ అంశాలను త్వరిత గతిన పూర్తి చేసి భూములను రైల్వే శాఖకు అప్పగించాలని జిల్లా కలెక్టరు ఆర్ మహేష్ కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్ నందు రైల్వే అధికారులు జిల్లా జాయింటు కలెక్టరు టి. నిశాంతి, ఆర్డీవోలు కె.మాధవి,పి.శ్రీకర్, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి భూసేకరణ పెండింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ పెండింగ్ అంశాలపై ప్రత్యేక మైన దృష్టి సాధించాలని ఆదేశిస్తూ పరిష్కార దిశగా గడువులను విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కోర్టు వెలు వరించిన తీర్పు ప్రకారం పాత, కొత్త అలైన్మెంట్ ప్రకారం రెవెన్యూ, రైల్వే అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భట్నవిల్లి నుండి గుడిమెళ్ళంక వరకు ఈ జాయింటు సర్వేను త్వరితగతిన నిర్వ హించి నివేదికను సమ ర్పించాలన్నారు. అదేవిధంగా భూసేకరణకు మ్యాపులు విలేజ్ స్కెచ్ లను ఆయన పరిశీలించి కేసుల ఉపసంహరణ దిశగా చర్యలు చేపట్టడంతో పాటు భూముల నష్టపరిహారాలకు సంబంధించి మార్కెట్ విలువల ప్రకారం బడ్జెట్ రిక్వైర్మెంట్ కు అంచనాలు రూపొందించి సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే జూనియర్ ఇంజనీర్ పి.రాహుల్,భూసేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ ఏసుబాబు సిబ్బంది దొర బాబు తదితరులు పాల్గొ న్నారు.

# వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా మధుసూదనరావు



**కంకిపాడు జూలై 21(వార్తా ప్రభ, ప్రతినిధి)**మండలంలోని ఉప్పులూరు గ్రామంలో సోమవారం వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుల ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పెనమలూరు నియోజకవర్గం శాసనసభ్యులు బోడె ప్రసాద్ పాల్గొని సంఘం అధ్యక్షులుగా పడవల మధుసూదనరావు, డైరెక్టర్లుగా పరస సురేష్, వెంగల దుర్గాభవానిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ పదవి అలంకారంగా భావించకుండా కూటమి సభ్యులను కలుపుకొని పోతూ ప్రభుత్వానికి ఓట్లు పెరిగే విధంగాను, రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్లు అన్నే ధనయ్య, కొండా ప్రవీణ్, మాజీ ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్, ఎంపీపీ నెర్సు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టిడిపి నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

# పేద వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**తొర్రూర్ మండలంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేసిన స్థానిక శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి**




**తొర్రూర్ జూలై 21(వార్తా ప్రభ)** పేద వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్దిదారులకు ఆహార భద్రత పథకం కింద కొత్త రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పేదల పట్ల తీవ్ర అన్యాయం చేశాయన్నారు. గత పది సంవత్సరాలపాటు రాష్ట్రంలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా జారీ చేయలేదని ఆమె పేర్కొన్నారు. కాని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పాలనలో, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కష్టాలను అర్థం చేసుకుని, వారి సమస్యల పరిష్కారానికి నడుం బిగించిందన్నారు. ఆహార భద్రతతో పాటు, రేషన్ కార్డు ద్వారా పేదలకు అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయని, ఇది న్యాయమైన హక్కుగా పరిగణించాలని అన్నారు. పేద ప్రజలు సంక్షేమం దృష్టిలో పెట్టుకొని సన్నబియ్యాన్ని రేషన్ షాపుల్లో ఇవ్వడం మూలంగా ధనవంతుడు ఏ విధంగా సన్నబియ్యం తింటున్నాడో పేదవాడు కూడా అదే విధంగా సన్నబియ్యం తినాలని ఉద్దేశంతో ఈ పథకం ప్రవేశపెట్టాడన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మండల రెవెన్యూ తహశీల్దార్, శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ నరసయ్య స్థానిక ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంచు సంతోష్ వివిధ గ్రామాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగనవాడి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి




**కంకిపాడు జులై 21 (వార్తా ప్రభ,ప్రతినిధి)**మండల కేంద్రమైన కంకిపాడు అంగన్వాడీ కార్యాలయం నందు సోమవారం అంగన్వాడీ వర్కర్స్ %౩%హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ (అనుబంధం )ఆధ్వర్యంలో తమసమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు తాడంకి. నరేష్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ కి హెల్పర్ కి బాలింతలకు గర్భిణీలకు చిన్న పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని సెంటర్ నిర్వహణకు ఒక యాప్ మాత్రమే వినియోగించాలన్నారు. 2022లో ఫోన్ ఇచ్చారు ఆ ఫోన్లు ఇప్పుడు సరిగా పనిచేయట్లేదు యాప్లు డౌన్లోడ్ చేయడానికి నెట్ అందుకోవడం లేదు పనిచేయటం లేదు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరుకులు పంపిణీ మొత్తం ఆన్లైన్ ద్వారానే చేయాలని పై అధికారులు ఒత్తిడితో అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క చాలీచాలని వేతనం మరోపక్క మానసిక ఒత్తిడి మరోపక్క సంక్షేమ పథకాల కి అర్హత లేకపోవడం పేరుకు ప్రభుత్వ ఉద్యోగులు అంటారు కానీ ప్రభుత్వ ఉద్యోగి ఇచ్చే వేతనంఇవ్వరు జీతానికి వచ్చేసరికి మీరు స్కీం వర్కర్లు అంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలవేతనాలు పెంచాలి, గ్రాడ్యుటి అమలు చేయాలి ఉద్యోగ భద్రత కల్పించాలి మెడికల్ లీవులు కల్పించాలి యాప్ల పని భారం తగ్గించాని ఆయన అన్నారు, అలాగే ఎన్నికల ముందుఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు, వర్షాకాలం అసెంబ్లీ సమావేశాల్లో అంగనవాడి సమస్యలపై చర్చి జరిపి పరిష్కరించాలి లేనిపక్షంలో తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో కంకిపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు వై నళిని కుమారి, సెక్టార్ లీడర్లు, రమా, విజయలక్ష్మి, హస్నాబి, కనకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పులూరులో సుపరిపాలన తొలి అడుగు



**కంకిపాడు జూలై 21 (వార్తా ప్రభ, ప్రతినిధి)**మండలంలోని ఉప్పులూరు గ్రామంలో సోమవారం ఇంటింటికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెనమలూరు నియోజకవర్గం శాసనసభ్యులు బోడే ప్రసాద్ గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుపరిచిన, అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను వివరించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకు వచ్చిన పలు సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బోడే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సుపరి పాలన అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్లు కొండా ప్రవీణ్, ధనయ్య, సర్పంచి లాం సోనియా, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ద్వారావతి దాతృత్వం ఆదర్శనీయం- కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూలై 21 :(వార్తా ప్రభ (ప్రతినిధి)**ఆకలి కడుపులను నింపి.. మానవ సేవయే మాధవ సేవగా తలచి దాతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ద్వారావతి ఫౌండేషన్ అందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. నిత్యం ఎంతోమంది ఆకలిని తీర్చుతున్న ద్వారావతి నిత్యాన్నప్రసాద సేవ ద్వారా గత నాలుగేళ్లుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాలను వచ్చే వారికి భోజనం అందిస్తున్నారు. సోమవారం ఈ సేవా కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు సమర్పించేందుకు చాలా దూరప్రాంతాల నుంచి సైతం ప్రజలు వస్తుంటారని.. అలాంటివారు దాదాపు 200 మంది ఆకలిని తీర్చుతున్నద్వారావతి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అన్నార్తులకు చేయూతనివ్వడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఫౌండేషన్ వైద్య సేవలను కూడా అందిస్తోందన్నారు. ప్రతి ఆదివారం విజయవాడ, నూజివీడులో ఉచిత ఆదివారం హాస్పిటల్స్ ద్వారా, ప్రతి నెలా మెగా క్యాంపులను నిర్వహిస్తూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి చాలా ఉన్నతమైనదని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ జి.సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ పి.సత్య, ట్రస్టీ బోర్డు సభ్యులు ఎస్.విజయ్, కుమార్, సుధాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్ లో ఘనంగా బోనాల పండుగ.





**కూకట్ పల్లి, జూలై 21(వార్తాప్రభ):**కూకట్ పల్లి 121 డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయంలో హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజా దేవి రంగారావు, మరియు గోటిముక్కుల వెంకటేశ్వరరావు, గొట్టిముక్కుల పెద్ద భాస్కర్ రావు,ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ ఏం.విట్టల్, సీనియర్ నాయకులు టి. నర్సింలు, బాలు యాదవ్,బి. ఎర్రన్న, కాశీం యాదవ్, శివకుమార్,టైల్ శ్రీనివాసులు, నరసింహ చారి, పరమేష్ గౌడ్, కుమార్ యాదవ్,వెంకట్ యాదవ్, వెంకటయ్య, శంకర్ సింగ్, మహిళలు, కాలనీవాసులు,భక్తులు పాల్గొని అమ్మవారి తీర ప్రసాదాలు స్వీకరించారు.

# సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టిన యుటిఎఫ్ నాయకులు





**చేజర్ల జూలై 21 (వార్తాప్రభ)** మండలంలోని యూటీఎఫ్ యూనియన్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదలు పెట్టడం జరిగింది. మొదటిరోజు సభ్యత్వ క్యాంపెయిన్లో మాముడూరు తూర్పుపల్లి ఎన్వి కండ్రిక ఉన్నత పాఠశాలలతో పాటు మరో 23 ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి వారిచే సభ్యత్వం నమోదు చేయించడం జరిగింది. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ చేజర్ల మండలంలోనే గాక జిల్లా రాష్ట్రస్థాయిలో అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘం యూటీఎఫ్ మాత్రమేనని ఉపాధ్యాయులకు అవసరమైన సేవలను అందించుటలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎప్పుడూ అగ్రభాగాన ఉంటుందని ఏ సమస్య అయినా యూనియన్ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగినేని రమణయ్య మండల నాయకులు ఆర్. వెంకట కృష్ణారెడ్డి రవిబాబు సుబ్రమణ్యం సునీల్ మస్తాన్ భాష సాదిక్ చిట్టిబాబు మాధవ మరియు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# బి. జె.పి.ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యదర్శి గా కల్లూరి శ్రీ వాణి....



**పెనుగంచిప్రోలు, జులై 21( వార్త ప్రభ)** ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ గౌరవ అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ నూతన ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యవర్గాన్ని సోమవారం నియమించడం జరిగింది. జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి మరొకసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రపుల్ల శ్రీకాంత్ మరియు కార్యదర్శిగా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన కల్లూరి శ్రీవాణి నియమించబడ్డారు. ఎస్సీ ఎస్టీ బీసీలకు సముచిత గౌరవం దక్కిందని భారతీయ జనతా పార్టీ తోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మరొకసారి నిరూపించబడినది. వివిధ రాజకీయ పార్టీ పెద్దలు వీరికి అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపుతూ జగ్గయ్యపేట నియోజకవర్గానికి జిల్లాస్థాయిలో సముచిత గౌరవ దక్కిందని హర్ష వ్యక్తం చేస్తూ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



సీనియర్ న్యాయవాది గుత్తా వెంకట్రావు చౌదరి బెజవాడ బార్ అసోసియేషన్ లైబ్రరీకి వారి దగ్గర ఉన్న లా జనరల్స్ (లైబ్రరీని) వారి జూనియర్స్ ద్వారా ఇవ్వడం జరిగింది. వారికి బెజవాడ అసోసియేషన్ తరుపున ధన్యవాదాలు తెలుపుతున్న జనరల్ సెక్రెటరీ కె.వి.రంగారావు, లైబ్రేరియన్ కంచర్ల శ్రీనాథ్, సీనియర్ న్యాయవాది అచ్యుత్ మరియు ఇతర న్యాయవాదులు -విజయవాడ లీగల్,జూలై 21 (వార్తాప్రభ) :

# 25న కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ చెస్ పోటీలు..

● అదే రోజు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు.. ● పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు..



గుడివాడ,జూలై 21 (వార్తాప్రభ) : ఎన్.టి.ఆర్. స్టేడియం కమిటీ సాంవత్సరిక క్రీడా ప్రణాళికలో భాగంగా ఈనెల 25వ తేదీన ఎన్.టి.ఆర్. స్టేడియం నందు కఠారి శ్రీనివాస రావు మెమోరియల్ గుడివాడ ఆల్ స్కూల్స్ చెస్ పోటీలు అలాగే కృష్ణాజిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తెలియజేశారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో గుడివాడకు చెందిన అన్ని స్కూల్స్ అనగా ప్రైవేట్ మరియు గవర్నమెంట్ స్కూల్స్ విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొనవచ్చున్నన్నారు. అదేరోజు కఠారి శ్రీనివాస రావు మెమోరియల్ కృష్ణాజిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించబడును. ఈ పోటీలు అండర్ 13, అండర్ 15 క్రీడాకారులకు సింగిల్స్ మరియు డబుల్స్ క్రీడాకారులకు విడివిడిగా పోటీలు నిర్వహించబడును. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఎవరి చెస్ కిట్స్ మరియు ఎవరి షటిల్ బ్యాట్స్ వారే తెచ్చుకొనవలెను. ఈ పోటీలలో పాల్గొనుటకు సింగిల్స్కు 300/- మరియు డబుల్స్కు 500/- ఎంట్రీ ఫీ కట్టి పేరు నమోదు చేసుకొనవలెను. పై పోటీలలో పాల్గొనదలచిన వారు మీ పేర్లను తేది 24 సాయంత్రం 5::00 గంటలలోపు స్టేడియం ఆఫీసు నందు నమోదు చేసుకొనవలెను. ఈ పోటీలలో పాల్గొను క్రీడాకారులు 25వ తేది ఉదయం 09 గం॥లకు రిపోర్టు చేయవలయును. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ఇవ్వబడును. ఇతర వివరముల కొరకు సెల్ నెం. 8179751717 (చెస్) మరియు 8919477065 (షటిల్ బాడ్మింటన్), 7032077735 లను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కొరపు రంగ ప్రసాద్, జీవితకాల సభ్యుడు బొగ్గరపు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం

● స్మారక పార్కు ఏర్పాటు హర్షణీయం.. ● కొనకళ్ళ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ళ సీతయ్య..





గుడివాడ,జూలై 21 (వార్తాప్రభ) : తమిళనాడు రాష్ట్రంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రము కలిసి ఉన్నప్పుడు మన తెలుగు వాళ్ళని హీనంగా చూస్తున్నారని మర్యాద ఇవ్వడం లేదని అమర జీవి పొట్టి శ్రీరాములు ప్రభుత్వాన్ని తమిళనాడు నుండి మనకి ఆంధ్రులకి తెలుగు వాళ్లకి ప్రత్యేక రాష్ట్రము ఇవ్వాలని కోరుతూ నిరాహార దీక్ష చేసి 58 రోజులకి మరణించినారు ఆయన మరణించిన తర్వాత ప్రత్యేక రాష్ట్రం తెలుగు వాళ్ళకి ఏర్పాటు చేశారు. తర్వాత వైశ్య సంఘ నాయకులు టీజి వెంకటేష్, చిన్ని రామ సత్యనారాయణ లు ప్రభుత్వాన్ని శ్రీరాములుకి ప్రత్యేక స్థలము కేటాయించి స్మృతి వనము ఏర్పాటు చేయాలని చాలా సార్లు అడిగారు ఇంతవరకు ఎవరు చేయలేదు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు, లోకేష్ మరియు పవన్ కళ్యాణ్ లు అమరావతిలో 6 ఎకరాల 8సెంట్లు స్థలాన్ని కేటాయించి స్మృతి వనానికి ఏర్పాటు చేశారు. వైశ్యులకుండా ఆంధ్ర ప్రజలందరూ సంతోషానంద విషయము.. ఈసందర్భంగా వాసవి చౌకులో శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు, డిప్యూటీ సీ.ఎం.పవన్ కళ్యాణ్ లకు కొనకళ్ళ సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ళ సీతయ్య ధన్యవాదాలు తెలియజేశారు.

# విద్యార్థులకు మంచినీటి బాటిల్స్ పరీక్ష ప్యాడులు పంపిణీ



తిరువూరు,జూలై 21 (వార్తాప్రభ) : మండలం.ఎర్రమాడు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మంచినీటి బాటిల్,పరీక్ష ప్యాడ్,పలకలు, పెన్నులు ఎర్రమాడు గ్రామానికి చెందిన నాళ్ళ లక్ష్మణరావు మేన కోడలు సుగ్గల శ్రావణి జన్మదినం సందర్భంగా పాఠశాల లోని 30 మంది విద్యార్థులకు పలకలు,పెన్నులు,పెన్సిల్ లు,వాటర్ బాటిల్స్, పరీక్ష ప్యాడ్ లను వితరణ గా అందచేశారు..ప్రతి సంవత్సరం తన జన్మదినం సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రమం తప్పకుండా ఈ విధంగా పుస్తకాలు, పెన్నులు వంటి వాటిని వితరణ గా ఇస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వి.కొండయ్య లు శ్రావణి ని వారి కుటుంబ సభ్యులను అభినందించారు.. ఈ కార్యక్రమంలో నాళ్ళ.లక్ష్మణరావు కుటుంబ సభ్యులు సుగ్గల. శ్రావణి,సుగ్గల సత్యమోహన రావు ,సుగ్గల. పద్మకుమారి,నాళ్ళ.పండు,ప్రసన్న తదితరులు పాల్గొన్నారు

# మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయం - కైకలూరు ఎమ్మెల్యే కామినేని..

● అట్టహాసంగా మానవతా సంస్థ కృష్ణాజిల్లా కార్యవర్గాల ప్రమాణ స్వీకారాలు..

● మానవత జిల్లా శాఖలో పొట్లూరి, దండమూడి, అన్నపురెడ్డిలకు స్థానం..





గుడివాడ,జూలై 21 (వార్తాప్రభ) : కైకలూరులో శ్రీ సీతారామ ఫంక్షన్ హాల్ లో కృష్ణాజిల్లా కార్యవర్గాల ప్రమాణ స్వీకారాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మానవతా వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ మారుపోయిన కోటేశ్వరరావు లు విచ్చేసినారు. ఈ కార్యక్రమానికి మారుబోయన కోటేశ్వరావు అధ్యక్షత వహించగా, రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్గా పొట్లూరి వీర శేషగిరిరావు, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్గా దండమూడి జయలక్ష్మి, మరియు ఉమ్మడి కృష్ణాజిల్లా కోశాధికారిగా అన్నపురెడ్డి గోపి రెడ్డి, జిల్లా అధ్యక్షులుగా కైకలూరు చైర్మన్ కొండ్రెడ్డి సత్యనారాయణ (పెదబాబు) ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. మన గుడివాడ నుంచి జిల్లా పదవులకు ముగ్గురును ఎంపిక చేసిన రాష్ట్ర కార్యవర్గానికి గుడివాడ మానవతావాదులు ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ ముగ్గురికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవతా సంస్థ చేస్తున్న కార్యక్రమాలు సమాజ హితానికి మరియు ఉత్తమ సమాజ నిర్మాణానికి తోడ్పడేవిగా ఉన్నవని నా వంతు సహకారం ఎల్లప్పుడూ మానవతాకి ఉంటుందని తెలియజేశారు. రామచంద్ర రెడ్డి ఉపనిషత్తుల గురించి ప్రసంగించారు. అలాగే కోటేశ్వరరావు మానవతా కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా చైర్మన్ రామాంజుల రెడ్డి, వెస్ట్ గోదావరి జిల్లా చైర్మన్ ఆలపాటి నాగేశ్వరావు, దేవినేని భాస్కర్ రావు, అడిసెమిల్లి నిర్మల మరియు 16 మండలాల నుంచి మానవత ప్రతినిధులు పాల్గొన్నారు. పొట్లూరి వీర శేషగిరిరావు పుట్టినరోజు సందర్భంగా సభలో రాష్ట్ర కార్యవర్గము, జిల్లా కార్యవర్గం, గుడివాడ కార్యవర్గము మరియు ఇతర మానవతా మిత్రులు అందరూ అతనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నరసాపురం ఫెయిర్ బస్ స్టాప్ కు విజ్ఞప్తి



విస్సన్నపేట,జూలై 21 (వార్తాప్రభ) : స్థానిక మండలంలోని నరసాపురం గ్రామంలో సత్తు పల్లి డిపో బస్సులు అప్ అండ్ డౌన్ ఫెయిర్ స్టాఫ్ ఏర్పాటు చేయా లని టీఎస్ ఆర్ టి సి డి ఎం కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ డైరెక్టర్ గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, తెలుగు రైతు నాయకులు ధమాలపాటి సాంబశివరావులు డిపో మేనేజర్ ను పట్టు శాలువాతో సత్కరించి ఫల పుష్పాలు అందించారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మ వారికి పలు గ్రామాల నుండి ఆషాఢ మాసం సారె ను అందజేసిన మహిళా భక్తులు





పెనుగంచిప్రోలు,జూలై 21 (వార్తాప్రభ) : శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా నందిగామ, ముళ్లపాడు ముచ్చింతాల గ్రామాల నుండి మహిళా భక్తులు మేళతాలాలు మంగళ వాయి ద్యాల మధ్య సారె సమర్పించినారు,వారికి దేవస్థానము అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్ద ప్రసాదాలు అందజేశారు..

# ఐదు జిల్లాలో చోరీలకు పాల్పడిన బైక్ దొంగలను అరెస్ట్ చేసిన గుడివాడ వన్ టౌన్ పోలీసులు

● ఆరు లక్షల, 50వేల విలువచేసే 14 వాహనాలు స్వాధీనం.. ● చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులకు రివార్డులు..





గుడివాడ,జూలై 21 (వార్తాప్రభ) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఐదు జిల్లాల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న బైక్ దొంగలను కృష్ణాజిల్లా, గుడివాడ పోలీసులు అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న బైక్ లు, పోలీసులు మీడియా ముందు ప్రదర్శించగ, గుడివాడ డిఎస్పి ధీరజ్ వినిల్ వివరాలు వెల్లడించారు. ఐదు జిల్లాల్లోనీ 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు తెలిపారు. దొంగల్లో ఒకరు ఆటో డ్రైవర్ కాగా, మరొకరు టాపిక్ పని చేస్తున్నారన్నారు. వారి వద్ద ఆరు లక్షల, 50వేల విలువచేసే 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డిఎస్పి ధీరజ్ వినీల్ చెప్పారు. పార్కింగ్ ప్రాంతాలు మరియు, రద్దీ ప్రదేశాల్లో రెక్కి నిర్వహించి వీళ్ళు దొంగతనాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఆయన అన్నారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన వన్ టౌన్ సి.ఐ కే.శ్రీనివాస్, ఎస్సై గౌతమ్ కుమార్, కానిస్టేబుళ్లు సురేంద్రబాబు, వేణుగోపాల్, మురళీకృష్ణ, సత్యనారాయణలను అభినందించిన డిఎస్పి ధీరజ్ వినీల్ వారికి రివార్డులు అందజేశారు.

# రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం,జూలై 21 (వార్తాప్రభ) : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 11 కెవి ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కెవి తెంపల్లి ఫీడర్ మెయింటెనెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడునని, రేపు అనగా మంగళవారం, 22వ తేదీ ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు తెంపల్లి, బల్లిపర్రు, మర్లపాలెం హౌసింగ్ కాలనీ, ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదా రులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు

# గ్రీవెన్స్ సెల్‌కు ఏడు అప్లికేషన్స్..

గుడివాడ,జూలై 21 (వార్తాప్రభ) : గుడివాడ పురపాలక సంఘం కౌన్సిల్ హాల్ నందు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమములో ప్రజల నుండి మొత్తం 7 (ఏడు) గ్రీవియన్స్ అప్లికేషన్స్ వచ్చినట్లు కమీషనర్ ఎస్ మనోహార్ తెలియజేసారు. ఇందులో ప్రాపర్టీ టాక్స్ గురించి 1, హౌసింగ్ ఫర్ ఆల్ - 1, వాటర్ పైప్ లీకేజ్ - 1, ఆక్రమణలు - 1, తల్లికి వందనము - 1, స్వయం సహాయక సంఘాలు - 1, సి.సి.రోడ్డు - 1 మొత్తం ఏడు అప్లికేషన్స్ వచ్చియున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ పి. శ్రీనివాసరావు, మునిసిపల్ ఇంజనీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, అక్కౌంట్స్ ఆఫీసర్ జి.టి.నాయుడు, అసిస్టెంట్ సిటి ప్లానర్ యేసుబాబు, మునిసిపల్ మేనేజర్ బి. నిర్మల కుమారి, సి ఎమ్ ఎమ్ మరియు వివిధ సెక్షన్ల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారి గో సంరక్షణకు 58 వేల 116 రూ. విరాళం



పెనుగంచిప్రోలు,జూలై 21 (వార్తాప్రభ) : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి గోశాల లోని గోసంరక్షణ కు తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, నిజాంపేట్ వాస్తవ్యులు కె.వి ఎస్ రమేష్ కూతురు మోహన లహరి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి గో సంరక్షణకు 58 వేల 116 రూపాయలు ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాస రావు కు అందజేశారు.వారికి ఆలయ అర్చకులు, వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు, తీర్థప్రసాదములు అందజేశారు..

# భారీ వర్షాలు దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి..

● రూరల్ మండలంలో పర్యటించి.. పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..

రైతాంగ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి..





గుడివాడ,జూలై 21 (వార్తాప్రభ) : రైతాంగ సంక్షేమమే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొనే సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. గుడివాడ రూరల్ మండలంలోని తట్టివర్రు, రామనపూడి, సీపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే రాము సోమవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, డ్రైనేజీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి గ్రామాల్లోని పంట పొలాలు, కెనాల్స్ ను ఆయన పరిశీలించారు. పర్యటనలో భాగంగా స్థానిక రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే రాము వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో రైతాంగ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతన్నల సంక్షేమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. భారీ వర్షాల దృష్ట్యా అధికార యంత్రంగాన్ని ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. గ్రామాల్లో రైతులకు ఏ చిన్న సమస్య తలెత్తిన.. స్థానికంగా ఉన్న కూటమినేతలు లేదా, నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. వ్యవసాయ సీజన్లో రైతులకు మంచి దిగుబడి సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని, భారీ వర్షాల నేపథ్యంలో రైతులకు కూడా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు గోకవరపు సునీల్, చేకూరు జగన్మోహన్ రావు, చినబాబు, కైలే కాళిదాస్ ఫణి, రంజిత్, శివయ్య, దుర్గారావు, వెంకటేశ్వరరావు రైతు సంఘాలు నాయకులు, ఆయా గ్రామాల పరిధిలోని రైతులు, రైతాంగ సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామాల పెద్దలు తదితరులు ఎమ్మెల్యే రాము పర్యటనలో పాల్గొన్నారు.

# 23న గవర్నమెంట్ ఐ.టి.ఐ కళాశాలలో కౌన్సిలింగ్ ప్రక్రియ..

గుడివాడ,జూలై 21 (వార్తాప్రభ) : గుడివాడలో గల కే.బీ.ఆర్ గవర్నమెంట్ ఐ.టి.ఐ కళాశాలలో చేరుటకు 23-07-2025వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మరియు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు అప్లికేషన్ పెట్టుకున్న వాళ్ళందరూ కౌన్సిలింగ్ కు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో గుడివాడలో గల గవర్నమెంట్ ఐ.టి.ఐ లో హాజరు కావలసిందిగా కృష్ణాజిల్లా కన్వీనర్ మరియు ప్రిన్సిపల్ శ్రీమతి ఓ. మంజులాదేవి సోమవారం ఒక ప్రకటనలో కోరడమైనది. వివరములకు ఫోన్ నెంబర్లు 08674295953, 9346118232, 8143653907, 8297574757 లను సంప్రదించాలనీ పేర్కొన్నారు.

# పిఆర్సి కమిటీని వెంటనే నియమించండి

● పెండింగ్ డిఏలు మంజూరు చేయాలి ● ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి. ● చీఫ్ సెక్రటరీ ను కలిసిన ఏ.పీ. జె.ఎ.సి. నాయకులు



అమరావతి, జూలై 21 (వార్తాప్రభ) : వెలగపూడి సచివాలయంలో నూతన ఎన్జీజివో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మరియు ఎపి జేఏసి చైర్మన్ ఎ . విద్యాసాగర్, సెక్రెటరీ జనరల్ కే ఎస్ ఎస్ ప్రసాద్ (ఏపీ యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల నేతలు సోమవారం వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగులకు సంబంధించిన పి.ఆర్. సి. కమిటీని వెంటనే నియమించాలని, రెండు సంవత్సరాలకు పైగా కాలాతీతం అయినందున వేతన సవరణ కమిషను వెంటనే నియమించి వేతన సవరణ ప్రక్రియని ప్రారంభించాలని కోరారు. ఉద్యోగులకు సంబంధించి మూడు డి ఏ లు పెండింగ్ ఉన్నాయని, కనీసం రెండు డి ఎ లు అయినా మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సరెండర్ లీవ్ బకాయిలు తదితర వాటి మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులపై 2019 లిలి 24 సంవత్సరాల మధ్య వివిధ ఆందోళనలో నమోదైన పెండింగ్ కేసులన్నీ ఎత్తివేయాలని, ఇంటీరియమ్ రిలీఫ్ చెల్లించాలని,ఉద్యోగుల సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగు చీఫ్ సెక్రటరీ చైర్మన్ గా త్వరలోనే ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించిన ప్రక్రియ కూడా ప్రారంభమైంది అన్న విషయాన్ని జేఏసీ సంఘాల నేతలు చీఫ్ సెక్రెటరీ కి తెలియజేశారు. పబ్లిక్ సెక్టార్ గురుకుల ఉద్యోగులకు 60 నుంచి 62 సంవత్సరాల పదవీ విరమణ వయస్సు పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పెన్షనర్లకు సంబంధించిన అడిషనల్ కౌంటం పునరుద్ధరణ, 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓపిఎస్ వర్తింపు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తించాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పిఆర్సి కమిటీ ఏర్పాటు, డి ఎ మరియు బకాయిలు చెల్లింపు అంశాలలో ఉద్యోగుల్లో ఉన్న ఆందోళన చీఫ్ సెక్రటరీగా దృష్టికి విద్యాసాగర్ తీసుకుని వచ్చారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల విషయంలో ఈ.హెచ్.ఎస్. మేనేజ్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారని, సెక్రటరీ అధ్యక్షతన జరగవలసిన ఈ. హెచ్.ఎస్. స్టీరింగ్ కమిటీ మీటింగ్ ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు సమర్ధ నిర్వహణకు గాను తీసుకోవలసిన కొన్ని నిర్ణయాలను ఈహెచ్ ఎస్ స్టీరింగ్ కమిటీలో తీసుకొనవలసిన అవసరం ఉన్నదన్న విషయాన్ని జేఏసీ నేతలు చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకుని వచ్చారు. జేఏసీ నాయకులతో చీఫ్ సెక్రటరీ విజయానంద్ మాట్లాడుతూ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి ముందు కార్యాచరణ జరుగుతుందని, డిపార్ట్మెంట్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేశామని, ఉద్యోగులకు ఒకరోజు గ్రీవెన్స్ డే ని అమలుపరచమని ఉత్తర్వులు ఇచ్చామని, నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత 7500 కోట్ల రూపాయల్ని బకాయిల కింద చెల్లించామని, మిగిలిన అన్ని విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో బాధ్యతగా ఉంటుందని తెలిపారు. నూతనముగా ఏపీ ఎన్జీజివో సంఘ అధ్యక్షుడిగా మరియు ఏపీ జెఎసి చైర్మన్ గా ఎన్నికైన ఏ. విద్యాసాగర్ ను, రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డివి రమణను అభినందించారు. చీఫ్ సెక్రటరీ కె విజయానంద్ ని కలిసిన వారిలో రాష్ట్ర జె ఏ సి చైర్మన్ అలపర్తి విద్యా సాగర్, సెక్రెటరీ జనరల్ కె ఎస్ ప్రసాద్,ఏపి యు టీ ఎఫ్ డిప్యూటీ సెక్రెటరీ జనరల్ డి వి రమణ..కో. చైర్మన్. జి హృదయ రాజు, ఏపి టి ఎఫ్ చెన్నుపాటి మంజుల,ఎన్. చంద్రశేఖర్,వైస్ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ఇరిగేషన్. సి పి ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి ఎం దాస్,అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ ఆర్ ఎస్.హరనాధ్, గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు జానీ పాషా, పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్చంద్రశేఖర్, ఆర్టీసీ ఎన్ఎంయు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్. రాజేష్ కుమార్,పశ్చిమగోదావరి జిల్లా జె ఏ సి కన్వీనర్ నెరుసు రామారావు, రాష్ట్ర ఎన్ జి జి ఓ ఎస్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి జానకి,విజయనగరం జిల్లా సహాధ్యక్షుడు కిషోర్., కన్వీనర్ రాజ్యలక్ష్మి,విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు సిహెచ్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..



విజయవాడలో రితిక ఫౌండేషన్ నుంచి సామాజిక సేవా పురస్కారం -2025 అవార్డు అందుకుంటున్న రంగస్థల, సినిమా, టీవీ ఆర్టిస్ట్ వీరంకి వెంకట నరసింహారావు

, -జి.కొండూరు,జూలై 21 (వార్తాప్రభ) :

# రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

-కుంటముక్కలలో రూ.1.32 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు



**జి.కొండూరు(కుంటముక్కల),జూలై 21 (వార్తాప్రభ) :** మండలంలోని కుంటముక్కల గ్రామ శివారు 30వ జాతీయ రహదారి(ఐ.టి రోడ్డు)నుంచి కుంటముక్కల గ్రామం వరకు నాబార్డు- trenche-xxx నిధులు రూ. 1.32 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులకు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గుంతలు లేని రహదారులుగా చాలా వరకు రోడ్లను అభివృద్ధి చేసిందన్నారు.మైలవరం నియోజక వర్గంలో కూడా రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు వెల్లడించారు.పలు చోట్ల కొత్తగా రోడ్ల నిర్మాణానికి, వంతెనల పునఃనిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), టీడీపీ మండల అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు పజ్జూరు రవికుమార్,లంక రామకృష్ణ వరప్రసాద్, కుంటముక్కల గ్రామ పార్టీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి, గ్రామ సర్పంచ్ వంగూరి కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే

-మాజీ ధర్మకర్త ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్



**సనత్ నగర్,జూలై 21 (వార్తాప్రభ) :** ఆషాడ మాసం చివరి ఆదివారం సందర్భంగా హైదరాబాదులోని సనత్ నగర్ చుట్టుపక్కల ప్రాంతంలో గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ధర్మకర్త ఆంజనేయులు యాదవ్ వారు కూడా వాళ్ళ కుటుంబ సభ్యులతో సనత్ నగర్ లోని గ్రామదేవతకు బోనము మరియు వడిబియ్యము సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారు ప్రజలందరినీ సుఖసంతోషాలతో చూడాలని మరియు వర్షాలు బాగా పడాలని కోరడం జరిగింది. సర్వేజనా సుఖినోభవంతు అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని ఆంజనేయులు యాదవ్ పేర్కొన్నారు.

# చిట్టి గూడూరు లో సుపరిపాలనలో తొలి అడుగు



**పెడన,జూలై 21 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం చిట్టి గూడూరు గ్రామం లో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలును ప్రజలకు వివరించి వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులుకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి చిట్టి గూడూరు గ్రామ పార్టీ అధ్యక్షులు గొరిపర్తి చంద్రశేఖర్ చింతగుంట కృష్ణ గోపి నాగబాబు ఎన్ ఏ బేగ్ బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కొలపల్లి రజిని కాట్రగడ్డ రత్నబాబు మాత్తి సుబ్రహ్మణ్యం ఎజ్జు శివాజీ పోతుల రాము రాసంశెట్టి శివరావు తోట వేణు, కట్రెడ్డి నాగ మురళి మునగాల భాస్కర్ సమ్మెట ఈశ్వర రావు డొక్కు ప్రసాద్ ఆలపాటి సత్యనారాయణ కాట్రగడ్డ సత్యనారాయణ చింతగుంట లక్ష్మీనారాయణ పోలగాని గోపాలరావు కార్యకర్తలు అధికారులు బూత్ యూనిట్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు



**కృత్తివెన్ను,జూలై 21 (వార్తాప్రభ) :** జిల్లా కార్య వర్గ సభ్యులు కొప్పినీడి సూర్య ప్రకాష్ అ ధ్వర్యంలో లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చినగొల్లపాలెం, రాళ్ల రేవు, లక్ష్మీ పురం,పోడు, ఉర్ల గోంది తిప్ప,చందాల,మాట్లం పాఠశాలల లోని వంద మంది ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. ఈ క్యాంపెయిన్ కు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ శౌకత్ హుస్సేన్,రాష్ట్ర కౌన్సిలర్ వీరాస్వామి,జిల్లా కౌన్సిలర్ వీరంకి శ్రీనివాస్ మండల గౌరవఅధ్యక్ష, అధ్యక్ష,కార్య దర్శులు సైకం ఆదినారాయణ,సాన రామకృష్ణ, ఉండి పురుషోత్తం పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

# బీసీలకు అండగా నాడు.. నేడు తెలుగుదేశం పార్టీ

- యాదవులకు చట్టసభలో ప్రముఖ స్థానం కల్పించింది కూటమి ప్రభుత్వం
- యాదవుల అభివృద్ధికి శక్తి మేర అండగా నిలుస్తా
- రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి









(పుట్టి రవి కుమార్)

**పెనమలూరు,జూలై 21 (వార్తాప్రభ) :** గత నాలుగు దశాబ్దాలుగా యాదవులకు చట్టసభలో ప్రముఖ స్థానం కల్పించింది తెలుగుదేశం పార్టీయే అని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి యాదవ్ పేర్కొన్నారు. పోరంకి లోని ఎస్.ఎస్. ఎన్. గార్డెన్స్ లో ప్రముఖ హైకోర్టు న్యాయవాది చింతగుంట శ్రీనివాస్ బాబా నేతృత్వంలో ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ బత్తుల అప్పారావు యాదవ్ అధ్యక్షతన జరిగిన "యదువంశీ" యాదవ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సారధి మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ నుంచే ఆంధ్రప్రదేశ్ లో బీసీలకు, యాదవులకు తెలుగుదేశ పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యత పెరిగిందన్నారు. నేడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వము బి. సి.,యాదవులకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అటు టీడీపి రాష్ట్ర అధ్యక్షులుగానే కాక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా యాదవులే ఉన్నారని, అదేవిధంగా రాష్ట్ర మంత్రివర్గంలో తనతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మరియు బీసీ శాఖకు యాదవులే మంత్రులుగా ఉన్నారన్నారు. అదేవిధంగా రాజ్యసభ మరియు శాసన మండలి సభ్యత్వాలు పలు కార్పొరేషన్ లో చైర్మన్ ల పదవులను యాదవులకు కూటమి ప్రభుత్వం అందజేసిందని మంత్రి సారధి పేర్కొన్నారు. దీనిని బట్టి కూటమి ప్రభుత్వం యాదవులకు ఇస్తున్న ప్రాధాన్యత అర్థం చేసుకోవాలన్నారు. వందలాది మంది యాదవ అధికారులు, ప్రొఫెషనల్ పాల్గొన్న ఈ సమావేశంలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. యాదవ సోదరులంతా ఐక్యంగా ఉండి వ్యాపార రంగంలో, రాజకీయ రంగంలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. యాదవులు వృత్తి పరంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం కోటి వరకు సబ్సిడీతో రుణాలు అందిస్తుందని, యాదవులు ముందుకు వస్తే తన పరిధిలో తాను ప్రభుత్వం తరపున సహకారం అందిస్తానన్నారు. అవసరమైన వారు తనను నేరుగా కలవచ్చునని పేర్కొన్నారు. తనకే కాదు.. తన తండ్రి కూడా ప్రజాబలంతో పాటు తన యాదవ కుల బలం ఉండడంతోనే ఇంతటి స్థాయి వచ్చిందని మంత్రి కొలుసు పార్థసారధి ఆనందాన్ని వ్యక్తం చేశారు. సమాజంలో నేడు మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఒక నాడు కష్టపడి ప్రజల అండ ఉంటే ఏ పదవి అయిన వచ్చేదని, కానీ నేడు ప్రజా బలం కష్టం తో పాటు కుల బలం కూడా ఉండాలన్నారు.సామాజిక దృక్పథంలో అన్ని కులాల మద్దతు ఉన్నా కూడా కుల బలం తోడ్పాటు అనేది అత్యున్నత స్థాయి కి తీసుకెళ్లేందుకు దోహదపడుతుందన్నారు.నేడు అనేక పదవుల్లో ఉన్నత స్థానం కి రావడానికి నీతి, నిజాయితీ ఒకటైతే సరిపోదని ఆర్థిక బలం కూడా అవసరమన్నారు. అందుకు మనలో మనమే మన కుల సభ్యులకు తోడ్పాటు అందించాలని ఆయన హితవు పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ 47 అనే నినాదంతో ముందుకు పోదామన్నప్పుడు సార్ ఇది సాధ్యమా..? అని అడగడం జరిగిందని అప్పుడు ఆయన ప్రతి కుటుంబం కూడా అన్ని విధాలా బాగుండేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారన్నారు. అందువల్ల మనము కూడా ఆ విజనరీకి తగ్గట్టుగా ముందుకు సాగి సమిష్టి కృషితో మన కలలను సాకారం చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకుంటూ మనకన్నా అణగారిన వారికి అండగా నిలుస్తూ యాదవ సంఘీయులు విద్య, వ్యాపార, రాజకీయ, సామాజిక రంగాలలో రాష్ట్రం, దేశం గర్వపడేలాగా ఉన్నతంగా ఎదగాలని ఆశాభావాన్ని మంత్రి సారధి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాదవ జాతి గౌరవాన్ని పెంచే విధంగా ఎదిగిన మంత్రి శ్రీ కొలుసు పార్థసారధి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ పి. చంద్రశేఖర్, ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ ఆవుల మురళి కృష్ణ యాదవ్, తిరుమల తిరుపతి దేవస్థానం స్టాండింగ్ కౌన్సిల్ గా నియమింపబడిన ప్రముఖ హైకోర్టు అడ్వకేట్ సి. శ్రీనివాస్ బాబాను ఏపీ విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ ముప్పసాని రామకృష్ణ, సీనియర్ జర్నలిస్ట వీర్ల శ్రీరామ్ యాదవ్, యాదవ సంఘ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పెద్ది బోయిన శ్రీనివాస్ యాదవ్, న్యూట్రిషనిస్ట్ వాడకప్పు సుధాకర్ యాదవ్ మరియు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ అన్వేష్,డా హారిక దంపతుల పర్యవేక్షణలో సన్మాన కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఐపిఎస్, ఐఏఎస్, వివిధ హోదాల్లో ఉన్న యాదవ అధికారులు, పెద్ద ఎత్తున డాక్టర్లు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# అనాసాగరం గ్రామ రైతుల విజ్ఞప్తిపై తక్షణ స్పందన

- స్వంత నిధులతో కాలువ పూడిక తీత పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే సౌమ్య
- ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన అనాసాగరం గ్రామ రైతులు



**నందిగామ,జూలై 21 (వార్తాప్రభ) :** పట్టణ శివారు అనాసాగరం గ్రామంలో రైతులు తమ పంట పొలాలకు సాగునీరు అందించాలని చేసిన విజ్ఞప్తిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వెంటనే స్పందించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తన సొంత నిధులతో అనాసాగరం-శనగపాడు సప్లై ఛానల్‌లో పూడిక తీత పనులను సోమవారం ప్రారంభించారు.అనాసాగరం గ్రామ రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి సమస్యను గుర్తించిన తంగిరాల సౌమ్య సాగునీరు సకాలంలో పొలాలకు అందేలా చేయడానికి చొరవ తీసుకున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించడం ద్వారా నీటి ప్రవాహం సాఫీగా సాగి, రైతుల పంటలకు అవసరమైన నీరు అందనుంది. ఈ పనులు పూర్తయితే గ్రామంలోని వందలాది ఎకరాల పంట పొలాలు సాగునీటి సౌకర్యాన్ని పొందనున్నాయి. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "రైతులు అన్నదాతలు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించడం మా ప్రభుత్వ బాధ్యత. అనాసాగరం రైతుల సమస్యను సొంత సమస్యగా భావించి, తక్షణ చర్యలు చేపట్టాము. ఈ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రతి రైతు పొలానికి నీరు అందేలా చేస్తాము," అని హామీ ఇచ్చారు. గ్రామ రైతులు ఈ చొరవను స్వాగతిస్తూ సౌమ్య సత్వర స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతు సంఘం నాయకులు, కూటమి నేతలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# అంధురాలను పింఛన్ ఇవ్వాలని కలెక్టరుకి వినతి



**కాకినాడ,జూలై 21 (వార్తాప్రభ) :** టైఫాయిడ్ జ్వరం వచ్చింది. దాని నిమిత్తం తలలో నరాలకు దెబ్బతిన్నాయని చికిత్సకు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరితే సర్జరీ చేసిన కొద్ది రోజుల్లోనే కంటిచూపు కోల్పోయిందని అందువల్ల తనకు అంధుల పింఛన్ ఇప్పించాలని జిల్లా కలెక్టరు షాన్ మోహన్ సగిలికి ఓ యువతి వినతి పత్రాన్ని అందించి తమ ఆవేదనను వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆ యువతి తల్లి, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి సోమవారం కాకినాడలో ఉన్న జిల్లా కలెక్టరు కార్యాలయానికి వచ్చింది. అక్కడ ప్రజా ఫిర్యాదులు కార్యక్రమం రద్దు చేసినందువల్ల కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెట్టు కింద దీనంగా కుటుంబ సభ్యులతో కూర్చున్నది. ఇంతలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ కార్యాలయమునకు వచ్చి ఆమె వద్దకు వెళ్లి ఆమె ఇచ్చిన వినతి పత్రం తీసుకొని వీలైనంత తొందరలో ఫించన్ అందించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ సమస్యకు సంబంధించిన వివరాలను పావని తల్లి వివరించింది. ప్రత్తిపాడుకు చెందిన బిర్రా పావనికి రెండేళ్ల క్రితం టైఫాయిడ్ జ్వరం సోకిందని దాంతో మెదడుకులో ఉండే నరాలు దెబ్బతిన్నాయన్నారు. అందుకు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చామన్నారు. అక్కడ తలకు చికిత్స నిర్వహించగా కొద్ది రోజుల తర్వాత కంటిచూపు కోల్పోయినట్లు ఆమె తల్లి వెల్లడించారు. అప్పటినుంచి ఆమె అన్ని మంచానికే పరిమితమై చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని అందువల్ల ప్రభుత్వం అందించే పింఛను అందించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలికి విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రత్యేకమైన దృష్టి సారించి బాధిత యువతకి పింఛన్ అందించేందుకు చర్యలు చేపడతానని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

# సుపరిపాలనలో తొలిఅడుగులో ప్రజలను ఆత్మీయంగా పలకరించిన ఎమ్మెల్యే వసంత





**జి.కొండూరు,జూలై 21 (వార్తాప్రభ) :** సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు జి.కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామంలో సోమవారం పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరించారు.సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇప్పటికే చాలా అమలు చేశామని మిగిలిన హామీలు త్వరలోనే అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందన్నారు. రానున్న నాలుగేళ్లలో సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), టీడీపీ మండల అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు పజ్జూరు రవికుమార్,లంక రామకృష్ణ వరప్రసాద్, కుంటముక్కల గ్రామ పార్టీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి,ఎంపీటీసీ సభ్యురాలు,వుయ్యూరు నరసింహారావు,అంకెం ఇందిరా ప్రియదర్శిని, ఎన్డీఏ కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాస సారె కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,జూలై 21 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని అంబారుపేట గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం వైభవంగా జరిగిన ఆషాడ మాస సారే కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొని, భక్తులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమతి తంగిరాల సౌమ్య మాట్లాడుతూ శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంతీయ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విశేష గుర్తింపు పొందిందని,ఆషాడ మాస సారే కార్యక్రమం భక్తుల మధ్య ఐక్యతను మరియు ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తుందని అన్నారు. ఆమె దేవస్థాన అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు,దేవస్థాన కమిటీ సభ్యులు, మరియు పలువురు ప్రముఖులు మరియు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి మాతకు శాకంబరీ అలంకారం సందర్భముగా అన్న సమారాధన !



**పెడన,జూలై 21 (వార్తాప్రభ) :** పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు డా. కొల్లూరి చిన్న పర్యవేక్షణలో పట్టణ ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో శ్రీ వాసవి మాతకు అన్ని రకముల కూరగాయలతో అలంకరించిన శాఖాంబరి అలంకారం ముగింపు సందర్భముగా శ్రీ వాసవి ప్రార్థన మందిరం (కళ్యాణమండపం) నందు నిర్వహించిన అన్న సమారాధనకు పెడన పట్టణ మండల పరిసర ప్రాంతా ఆర్యవైశ్య సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వాసవి అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. జై వాసవి జై జై వాసవి అను నామస్మరణతో శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రాంగణం మారు మోగింది. ఈ సందర్భంగా పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులచే సౌందర్యలహరి పారాయణా 108 శ్లోకాలను గులాబీ పూలతో పూజా కార్యక్రమాలను శ్రీ వాసవి క్షేత్రం అర్చకులు కోట సతీష్ శర్మ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఆత్మకూరి సురేష్ కుమార్ కృష్ణాజిల్లా ఆర్యవైశ్యవజన సంఘం ఉపాధ్యక్షులు చిలకల బాలాజీ కార్యదర్శి సమయ మంత్రి కుమార్ కార్యవర్గ సభ్యులు కొల్లిపర పవన్ తాడేపల్లి రామకృష్ణ సభ్యులు ఇమ్మడి మంగమోహన్ ఉదయగిరి గోపాల్ పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తాయారు ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ కార్యవర్గ సభ్యులు జల్లూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188